ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
తమిళనాడు
TAMILNADU
శనివారం 8 నవంబరు 2025

డీఎంకేని ఎవరూ టచ్ చేయలేరు

● పార్టీ అధ్యక్షుడు స్టాలిన్



రెడ్‌హిల్స్ 'మిసా' ఏళుమలై మనవడి వివాహ వేడుకల్లో పాల్గొన్న సీఎం స్టాలిన్, మంత్రి నాజర్, పార్టీ ప్రముఖులు

చెన్నై, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఏడు దశాబ్దాలకు పైగా ప్రజలకు చేరువగా, పటిష్ఠంగా నడుస్తున్న డీఎంకేను నాశనం చేయడం ఎవరి తరం కాదని ఆ పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పేర్కొన్నారు. ప్రస్తుతం కొత్తగా రాజకీయాల్లో ప్రవేశించినవారంతా డీఎంకేని నాశనం చేయాలని కలలు కంటున్నారని, వారి కలలు ఎన్నటికీ నెరవేరవని, పార్టీని ముట్టుకోలేరని ఆయన ధీమా వ్యక్తం చేశారు. అన్నా అరివాలయంలో శుక్రవారం ఉదయం జరిగిన పార్టీ ప్రముఖుడు దివంగత రెడ్‌హిల్స్ 'మిసా' ఏళుమలై మనవడి వివాహ వేడుకల్లో సీఎం పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. ఆ సందర్భంగా ఏర్పాటైన సభలో మాట్లాడుతూ.. ఎమర్జెన్సీ రోజుల్లో తనతోపాటు ఏళుమలై సెంట్రల్ జైలులో చిత్రహింసలు అనుభవించినట్లు గుర్తు చేశారు. దేశంలో ఎమర్జెన్సీ చీకటి రోజులనీ, రాష్ట్రంలో డీఎంకే ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేశారని, తనను అరెస్టు చేసి జైలులో ఉంచి చిత్రహింసలకు గురిచేశారని తెలిపారు. అదే సమయంలో మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి సభలకు స్థలం ఇచ్చేందుకు కూడా అందరూ భయపడుతుండేవారని, అలాంటి పరిస్థితుల్లో రెడ్‌హిల్స్ ఏళుమలై తన రెస్ మిల్లు ప్రాంగణంలో సభ జరుపుకునేందుకు అవకాశమిచ్చి, అరెస్టయ్యారని తెలిపారు. తనతోపాటు సెంట్రల్ జైలులో చిత్రహింసలను అనుభవించడం తానింకా మరచిపోలేదన్నారు. పార్టీకి ఎన్ని సంక్షోభాలు ఎదురైనా వాటన్నింటిని తట్టుకుని స్థిరంగా నిలిచిందన్నారు. డీఎంకే నేతలంతో ఎన్నో త్యాగాలు చేసి మరీ పార్టీని పెంచిపోషించారని, వారి ఆశయాలకు అనుగుణంగా నేటికీ పార్టీ నడుస్తోందని చెప్పారు. డీఎంకే త్యాగాలు, కష్టాలు దేశ చరిత్రలో జరిగాయని, ఇంతటి సుదీర్ఘ త్యాగంతో కూడిన చరిత్ర కలిగిన డీఎంకేని ఎవరూ నాశనం చేయలేరని స్టాలిన్ స్పష్టం చేశారు.

'సర్'పై నిఘా వేయండి...

రాష్ట్రమంతటా ఈ నెల 4న ప్రారంభమైన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)లపై పార్టీ శ్రేణులంతా నిఘా వేయాలని, ఓటర్ల తొలగింపులో ఏవైనా అక్రమాలు జరిగితే తనకు ఫిర్యాదు చేయాలని స్టాలిన్ సూచించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బిహార్‌లో ఎన్నికల సంఘం ద్వారా భారీగా ఓట్ల చోరీకి పాల్పడిందని, అలాంటి పరిస్థితుల్లో రాష్ట్రంలో ఓట్ల చోరీ జరుగకుండా బూత్ కమిటీల ఇన్‌ఛార్జులు అప్రమత్తంగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ వివాహ వేడుకల్లో మంత్రి ఎస్ఎం నాజర్, శాసనసభ్యులు ఎస్.సుదర్శనం, ఆర్డీ శేఖర్, ఇ. పరంధామన్, కే గణపతి, దురై చంద్రశేఖర్, డీఎంకే వ్యవస్థాపక కార్యదర్శి ఆర్ఎస్ భారతి, పార్టీ సమాచార కార్యదర్శి టీకేఎస్ ఇలంగోవన్, పార్టీ ప్రధాన కార్యాలయం కార్యదర్శి పూచ్చి మురుగన్ తదితరులు పాల్గొన్నారు.

బిల్లుల్లో జాప్యం అవాస్తవం

● అధికార పరిధిని అతిక్రమించినవి మాత్రమే రాష్ట్రపతి పరిశీలనకు
● రాజ్యాంగబద్ధంగానే గవర్నర్ చర్యలు
● రాజ్‌భవన్ వివరణ

చెన్నై, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): బిల్లుల ఆమోదంలో జాప్యం జరుగుతోందన్న ఆరోపణలను రాజ్‌భవన్ ఖండించింది. రాష్ట్ర ప్రజల ప్రయోజనాలకు వ్యతిరేకంగా గవర్నర్ వ్యవరిస్తున్నారంటూ కొన్ని మీడియా సంస్థల్లో వచ్చిన వార్తలను కూడా తీవ్రంగా తప్పుబట్టింది. ఈ మేరకు రాజ్‌భవన్ శుక్రవారం ప్రకటన విడుదల చేసింది. ఈ ఏడాది అక్టోబరు 31వ తేది వరకు మొత్తం 211 బిల్లులు పంపించగా, వాటిల్లో 81 శాతం బిల్లులకు గవర్నర్ ఆమోదం తెలిపారని, వాటిల్లో 95 శాతం బిల్లులు మూడు నెలల్లోనే ఆమోదించారని రాజ్‌భవన్ గుర్తు చేసింది. మరో 13 శాతం బిల్లులు రాష్ట్రపతి పరిశీలనకు పంపారని, అది కూడా వాటిల్లో అధికభాగం రాష్ట్ర ప్రభుత్వ సిఫార్సుపై పంపబడ్డాయని వివరించింది. మిగిలిన 8 బిల్లులు అక్టోబరు చివరి వారంలో గవర్నర్‌కు చేరగా, అవి పరిశీలనలో ఉన్నాయని పేర్కొంది. శాసనసభ రెండోమారు ఆమోదించిన బిల్లుల్ని గవర్నర్ ఆమోదించారని, అయితే పెండింగ్‌లో వున్న పది బిల్లుల విషయాన్ని మాత్రం గవర్నర్ ప్రభుత్వానికి సమాచారం ఇచ్చారని పేర్కొంది. అసెంబ్లీ రెండోమారు ఆమోదించినప్పటికీ, అవి యూజీసీ నిబంధనలకు విరుద్ధంగా ఉండడంతో పాటు అసెంబ్లీ అధికార పరిధి అతిక్రమించి వుండడంతో గవర్నర్ వాటిని రాష్ట్రపతి పరిశీలనకు పంపారని వివరించింది. రాష్ట్ర ప్రజల ప్రయోజనాలు కాపాడటానికి గవర్నర్ ప్రతి బిల్లు క్షుణ్ణంగా పరిశీలించారని, రాజ్యాంగంలోని నిబంధనలకనుగుణంగానే గవర్నర్ వ్యవహరిస్తున్నారని స్పష్టం చేసింది. అన్ని చట్టాలు రాజ్యాంగబద్ధంగా ఉండేలా చూసుకోవడం గవర్నర్ విధి అని. తమిళ వారసత్వం, కళ, సాహిత్యం, ఆధ్యాత్మికతను ప్రోత్సహించే ప్రయత్నాలకు గవర్నర్ నిరంతరం మద్దతిస్తున్నారని వివరించింది. రాష్ట్ర ప్రజల ప్రయోజనాల కోసం రాజ్యాంగ పరిమితుల్లో బాధ్యతాయుతంగా వ్యహరిస్తారని గవర్నర్ తెలిపారని రాజ్‌భవన్ ప్రకటించింది.

ఢిల్లీ వెళ్లిన గవర్నర్

గవర్నర్ ఆర్ఎన్ రవి రెండు రోజుల పర్యటన కోసం ఢిల్లీ వెళ్లారు. విమానాశ్రయం నుంచి శుక్రవారం సాయంత్రం 4.25 గంటలకు ఎయిర్ ఇండియా విమానంలో గవర్నర్ ఢిల్లీ బయల్దేరి వెళ్లారు. గవర్నర్ వెంట ఆయన కార్యదర్శి, భద్రతా ధికారి, సహాయకుడు తదితరులున్నారు. గవర్నన్ శనివారం రాత్రి 9 గంటలకు తిరిగి రానున్నట్లు రాజ్‌భవన్ వర్గాలు పేర్కొన్నాయి.

ఓపీఎస్ చూపు... డీఎంకే కూటమి వైపు ?



చెన్నై, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే నుంచి రెండు పర్యాయాలు రాష్ట్ర ముఖ్యమంత్రిగా వ్యవహరించిన సీనియర్ నేత ఓ.పన్నీర్‌సెల్వం (ఓపీఎస్) తమ చిరకాల ప్రత్యర్థి డీఎంకేలో చేరాలని భావిస్తున్నారా?.. రాజకీయ భవిష్యత్ లేని కారణంగా అనుచరులు, అనుయాయులు దూరమవుతుండడంతో ఏదో ఒక పార్టీలో ఉండడమే మేలని అనుకుంటున్నారా?.. బీజేపీ, టీవీకే వంటి పార్టీల నుంచి స్పందన కరువవడంతో డీఎంకేవైపు దృష్టి సారించారా?.. అవుననే అంటున్నాయి ఆయన సన్నిహిత వర్గాలు. దీనిపై ఇప్పటికే ఆయన ఒక స్పష్టతకు వచ్చినట్లు తెలుస్తోంది.

దివంగత ముఖ్యమంత్రి జయలలితకు నమ్మకస్తుడిగా నిలిచిన ఓపీఎస్.. ఆమె కష్టాల్లో చిక్కుకున్నప్పుడల్లా సీఎం పీఠంలో కూర్చునేవారు. ఆ తరువాత జయకు మార్గం సుగమం కాగానే పదిలంగా సీఎం పదవిని ఆమెకు అప్పగించి, నమ్మకస్తుడిగా పేరు తెచ్చుకున్నారు. జయ చావుబతుకుల మధ్య వున్నప్పుడు కూడా ఓపీఎస్ తప్పనిసరి పరిస్థితుల్లో సీఎం పదవి చేపట్టారు. అయితే ఆ తరువాత జరిగిన పరిణామాలతో ఆయన పార్టీపై తిరుగుబాటు చేసి, బహిష్కృతుడయ్యారు. అయితే జయ సన్నిహితురాలు శశికళ జైలుకెళ్లిన అనంతరం జరిగిన పరిణామాల్లో ఆయన మళ్లీ అన్నాడీఎంకేలోకి రావడంతో పాటు ఉపముఖ్యమంత్రిగా కూడా వ్యవహరించారు. అయితే పార్టీపై పూర్తి పట్టు సాధించిన మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్).. ఓపీఎస్‌కు సమాంతర అధికారం ఇచ్చేందుకు నిరాకరించారు. దీంతో అలిగిన ఓపీఎస్.. పార్టీ పగ్గాలను తన చేజిక్కించుకునేందుకు ప్రయత్నించి, విఫలమయ్యారు. అంతేగాక పార్టీ నుంచి కూడా బహిష్కృతుడైన విషయం తెలిసిందే. అప్పటి నుంచి మళ్లీ అన్నాడీఎంకేలో చేరేందుకు ఓపీఎస్ చేయని ప్రయత్నం లేదు. కానీ ఈపీఎస్ అందుకు నిరాకరించడంతో బీజేపీ అగ్రనాయకత్వాన్ని శరణుజొచ్చారు. బీజేపీ ఢిల్లీ పెద్దలు కూడా ఈపీఎస్‌కే అండగా నిలిచారు. దీంతో మనస్తాపం చెందిన ఓపీఎస్.. ఎన్‌డీఏ కూటమి నుంచి వైదొలగుతున్నట్లు ప్రకటించారు. ఆ తరువాత ప్రముఖ సినీ నటుడు విజయ్ స్థాపించిన టీవీకేతో పొత్తు పెట్టుకునేందుకు ప్రయత్నించినా, అటు నుంచి స్పందన లేకపోవడంతో ఓపీఎస్ మౌనం వహించారు. అయితే ఓపీఎస్‌కు రాజకీయ భవిష్యత్తు లేదని గ్రహించిన ఆయన అనుచరగణం.. ఒక్కొక్కరుగా దూరమవుతున్నారు. ఇప్పటికే ఎమ్మెల్యే మనోజ్ పాండ్యన్ డీఎంకే తీర్థం పుచ్చుకోగా, జేసీడీ ప్రభాకర్ వివిధ కారణాలతో దూరం జరిగారు. మాజీ మంత్రి ఆర్.వైద్యలింగం సైతం అనారోగ్యం కారణంగా ఓపీఎస్ దరి చేరడం లేదు. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే తాను రాజకీయంగా కనుమరుగు కాక తప్పదని ఆందోళన చెందుతున్న ఓపీఎస్.. డీఎంకే అధినేత స్టాలిన్‌తో తనకున్న సాన్నిహిత్యంతో పావులు కదుపుతున్నారు. ఇప్పటికే ఇటీవల నాటకీయంగా అడయార్‌లోని ఓ పార్కులో సీఎంకు తారసపడిన ఓపీఎస్.. ఆయనతో కొద్దిసేపు ముచ్చటించారు. అనంతరం స్టాలిన్ సోదరుడు మూకా ముత్తు చనిపోయినప్పుడు పరామర్శ పేరుతో సీఎంతో కొద్దిసేపు భేటీ అయ్యారు. కేవలం స్టాలిన్‌తో చర్చించేందుకే ఓపీఎస్ వాకింగ్, పరామర్శ పేరుతో కలుసుకున్నారని, అప్పుడే అన్నాడీఎంకే వర్గాలు విమర్శించాయి. అయితే వాటిని ఓపీఎస్ అప్పట్లో కొట్టిపారేశారు. ఈ నేపథ్యంలో డీఎంకేతో చేయి కలపడమే మేలని ఓపీఎస్ భావిస్తున్నట్లు తెలిసింది. అయితే నేరుగా డీఎంకేలో చేరడమా? లేక ఏదో ఒక పార్టీ స్థాపించి, డీఎంకే కూటమిలో చేరడమా అన్నదానిపై ఓపీఎస్ తర్జనభర్జన పడుతున్నట్లు సమాచారం. మరో నాలుగైదు నెలల్లోనే అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నందున త్వరలోనే ఆయన కీలక నిర్ణయం ప్రకటించనున్నట్లు సన్నిహితులు చెబుతున్నారు. ఇదిలా వుండగా డీఎంకే వర్గాలు సైతం ఓపీఎస్‌ను దరి చేర్చుకునేందుకు సుముఖంగానే వున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది.

డీఎంకే జెండాకు 75 యేళ్లు



చెన్నై, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): నలుపు, ఎరుపు రంగులు కలిగిన డీఎంకే పతాకం రూపొందించి 75 యేళ్లు పూర్తయిన సందర్భంగా శనివారం వళ్లువర్‌కోట్టం లో రెండు రోజుల సదస్సు నిర్వహించనున్నారు. పార్టీ యువజన విభాగం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరుగనున్నాయి. డీఎంకే అధ్యక్షుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ శనివారం ఉదయం ఈ వేడుకలను ప్రారంభిస్తారు. అలాగే 'కాలత్తిన్ నిరమ్ కరుప్పు శివప్పు' అనే గ్రంథాన్ని ఆవిష్కరించనున్నారు. ఆ తర్వాత సదస్సు పుస్తక ప్రదర్శన కూడా ప్రారంభిస్తారు. గత 75 యేళ్లలో రాష్ట్రంలో, వివిధ వర్గాల్లో, సమాజంలో డీఎంకే తీసుకొచ్చిన మార్పులకు సంబంధించిన అంశాలు 'కాలత్తిన్ నిరమ్ కరుప్పు శివప్పు' అనే గ్రంథంలో ఉన్నాయని సదస్సు నిర్వాహకులు తెలిపారు. ఈ గ్రంథాన్ని స్టాలిన్ ఆవిష్కరించి తొలి ప్రతిని సీనియర్ మంత్రి దురైమురుగన్‌కు అందజేస్తారు. 'ఇరువణ్ణ కొడిక్కు వయదు 75' పేరుతో శనివారం ఐదు సదస్సులు, ఆదివారం ఐదు సదస్సులు చొప్పున మొత్తం 10 సదస్సులు జరుగనున్నాయి. ఆదివారం సాయంత్రం ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి ప్రసంగంతో ఈ వేడుకలు ముగియనున్నాయి.

'సర్'కు వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో డీఎంకే పిటిషన్

● 11న విచారణ

ప్యారీస్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)కు వ్యతిరేకంగా డీఎంకే దాఖలు చేసిన పిటిషన్‌పై ఈ నెల 11న విచారణ జరుగుతుందని సుప్రీంకోర్టు ప్రకటించింది. సర్ ప్రక్రియ ద్వారా బీజేపీ కూటమికి వ్యతిరేకంగా ఉన్న ఓటర్లను తొలగించేందుకు కేంద్ర ఎన్నికల కమిషన్ చేస్తున్న కుట్ర అని సీఎం స్టాలిన్ ఆరోపించారు. రాష్ట్రంలో సర్ అవసరంలేదని ఆదివారం జరిగిన అఖిల పక్ష సమావేశం తీర్మానం ఆమోదించింది. ఈ తీర్మానాన్ని సమర్థిస్తూ సోమవారం డీఎంకే తరుపున సుప్రీంకోర్టులో సర్‌కు వ్యతిరేకంగా పిటిషన్ దాఖలైంది. ఈ పిటిషన్‌పై మంగళవారం సుప్రీంకోర్టు ప్రధానన్యాయమూర్తి నేతృత్వంలోని ప్రథమ ధర్మాసనం విచారణ జరపనుందని కోర్టు వర్గాలు తెలిపాయి.

అవయవదాతల పేర్లతో శిలాఫలకాలు

● ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం



శిలాఫలకాల ఆవిష్కరణలో మంత్రులు సుబ్రమణ్యం, శేఖర్‌బాబు తదితరులు

పెరంబూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): అవయవదాతలకు గౌరవం చేకూర్చేలా రాష్ట్రవ్యాప్తంగా త్యాగధనుల శిలాఫలకాలు (వాల్ ఆఫ్ హానర్) ఏర్పాటుచేయనున్నట్లు రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం వెల్లడించారు. అవయవాలు దానం చేసిన వారి త్యాగాలను స్మరించుకునేలా రాజీవ్ గాంధీ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో అవయవదాతల పేర్లతో కూడిన శిలాపలకాన్ని మంత్రి ఎం.సుబ్రమణ్యం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో హిందూ దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు, మేయర్ ప్రియ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సుబ్రమణ్యం మీడియాతో మాట్లాడుతూ... 2009 ఆగస్టు 28న నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న సీఎం స్టాలిన్, ఆయన సతీమణి దుర్గా తాము మరణించిన తర్వాత తమ శరీరాలు దానం చేసే పత్రాలపై సంతకాలు చేశారని తెలిపారు. వారి స్ఫూర్తితో నేడు ఎందరో ఆ బాటలో పయనిస్తూ దేహాలు దానం చేస్తున్నారన్నారు. అదే సమయంలో ప్రభుత్వం చేపట్టిన అవగాహనతో, మెదడు నిర్జీవమైన వారి అవయవాలు దానం చేసేందుకు కుటుంబ సభ్యులు ముందుకొస్తున్నారని తెలిపారు. అవయవదానం చేసిన వారి మృతదేహాలకు ప్రభుత్వం తరఫున నివాళులర్పించనున్నట్లు 2023 సెప్టెంబరు 23వ తేది సీఎం స్టాలిన్ ప్రకటించారన్నారు. అవయవ దానం అనంతరం ఆ మృతదేహాలకు ఆయా జిల్లాల కలెక్టర్లు, జిల్లా రెవెన్యూ అధికారులు ప్రభుత్వం తరఫున నివాళులర్పిస్తున్నారని తెలిపారు. సీఎం పిలుపుతో ఇప్పటివరకు 253 మంది అవయవ దానం చేసారన్నారు. రెండేళ్లలో ఇంతమంది అవయవ దానం చేయడం ద్వారా దేశంలోనే తమిళనాడు ప్రథమస్థానంలో నిలిచిందని తెలిపారు. అవయవ దానం చేసిన వారి త్యాగాలు స్మరించుకొనేలా వారి పేర్లతో కూడిన శిలాపలకం ప్రస్తుతం జీహెచ్ ప్రాంగణంలో ఏర్పాటుచేశామని, రాష్ట్రవ్యాప్తంగా శిలాపలకాలు ఏర్పాటుచేయనున్నట్లు మంత్రి సుబ్రమణ్యం తెలిపారు.

అరుళ్‌నిధికి సీఎం పరామర్శ

పెరంబూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఓ చిత్రం షూటింగ్‌లో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఎంకే తమిళరసు కుమారుడు, నటుడు అరుళ్‌నిధిని ముఖ్యమంత్రి స్టాలిన్ పరామర్శించారు. పోరూర్‌లోని రామచంద్ర మెడికల్ ఆస్పత్రిలో అరుళ్‌నిధికి శస్త్రచికిత్స జరిగింది.. ఈ క్రమంలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అరుళ్‌నిధిని ముఖ్యమంత్రి స్టాలిన్ స్వయంగా వెళ్లి పరామర్శించారు. ఆయనకు అందిస్తున్న చికిత్స వివరాలను వైద్యులను అడిగారు. సీఎం వెంట ఎంపీ ఎ.రాజా తదితరులు ఉన్నారు.

'సర్' ప్రజాస్వామ్యానికి విరుద్ధం

● విజయ్ కలలు ఫలించవు
● ఎండీఎంకే ప్రధాన కార్యదర్శి వైగో



సమావేశంలో ప్రసంగిస్తున్న వైగో

ప్యారీస్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియ ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ఎండీఎంకే ప్రధాన కార్యదర్శి వైగో పేర్కొన్నారు. ఎగ్మూర్‌లోని ఎండీఎంకే కార్యాలయంలో శుక్రవారం ఉదయం పార్టీ నాయకుల సమావేశం ప్రిసీడియం చైర్మన్ అర్జున్‌రాజ్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో వైగో కీలకోపన్యాసం చేశారు. రాష్ట్రంలోని క్వారీల నుంచి వెలువడే దుమ్ము, ధూళి వల్ల ఆ ప్రాంతాల ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని, దీనిపై స్పందించి బాధితులకు ప్రభుత్వ నష్టపరిహారం చెల్లించాలని, గుర్తింపు లేని క్వారీలను తక్షణం మూసివేయాలని, నిబంధనలను అతిక్రమించే వారికి జరిమానా విధించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మరో నాలుగు నెలల్లో రాష్ట్ర అసెంబ్లీకి ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో, ఓటరు జాబితా సవరణ ప్రక్రియను ప్రారంభించడం ప్రజాస్వామ్యానికి వ్యతిరేకమన్నారు. బీజేపీని మెప్పించే విధంగా కేంద్ర ఎన్నికల కమిషన్ చేపట్టిన సర్‌పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ నెల 11న ఇండియా కూటమి తరుపున సర్‌కు వ్యతిరేకంగా రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లో నిర్వహించనున్న ధర్నాలో ఎండీఎంకే శ్రేణులు పాల్గొంటారని ఆయన తెలిపారు. రాజకీయ సభల నిర్వహణకు ప్రభుత్వం విధించిన నిబంధనలపై ప్రజాభిప్రాయం తెలుసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో ప్రస్తుతం ద్రావిడ సిద్ధాంతాలను వ్యతిరేకిస్తున్న వారి సంఖ్య బాగా పెరిగిందని, వీరి నుంచి దీనిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో సీఎం కావాలని టీవీకే అధ్యక్షుడు విజయ్ కంటున్న కల ఫలించదన్నారు. ఎంపీ దురై వైగో, కోశాధికారి సెంథిల్ అధిబన్, డా.రెహన్యా, ఉన్నతస్థాయి కమిటీ సభ్యులు, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్న ఈ సమావేశం ఐదు తీర్మానాలను ఆమోదించింది.

భక్తితోనే అసమానతలు దూరం

● త్రిదండి చిన్న జీయర్ స్వామి -7లో



న్యూఢిల్లీ పర్యటనలో భాగంగా శుక్రవారం ఇండియా హాకీ శతవార్షికోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన ఫొటో ప్రదర్శన తిలకిస్తున్న ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి, యువజన సంక్షేమం, క్రీడాభివృద్ధి శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి అతుల్య మిశ్రా, తమిళనాడు క్రీడాభివృద్ధి కమిషన్ మెంబర్ సెక్రటరీ మేఘునాథ రెడ్డి తదితరులు.

అన్నాడీఎంకేలో కొనసాగుతున్న తొలగింపుల పర్వం

● మాజీ ఎంపీ సత్యభామ సహా 12మందిపై వేటు
● వరుసగా సెంగోట్టయ్యన్ అనుచరుల గెంటివేత



మాజీ ఎంపీ సత్యభామ

చెన్నై, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకేలో డిస్మిస్‌ల పర్వం కొనసాగుతోంది. ఆ పార్టీ బహిష్కృత నేత, మాజీ మంత్రి కేఏ సెంగోట్టయ్యన్ వర్గానికి చెందిన వారిపై వరుసగా వేటు పడుతోంది. సెంగోట్టయ్యన్ అనుచరులైన మాజీ ఎంపీ సత్యభామ సహా 12 మందిని అన్నాడీఎంకే అధినేత ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) పార్టీ నుండి తొలగించారు. అక్టోబరు 30న రామనాథపురం జిల్లా పసుంపొన్ గ్రామంలో దేవర్ జయంతి సందర్భంగా సెంగోట్టయ్యన్ ఏఎంఎంకే నేత టీటీవీ దినకరన్, మాజీ ముఖ్యమంత్రి ఓ.పన్నీర్‌సెల్వం, శశికళ సమావేశమై పార్టీకి పూర్వవైభవం కల్పిస్తామంటూ ప్రకటించారు. ఆ నేపథ్యంలో ఈపీఎస్ సెంగోట్టయ్యన్ సహా 50 మందిని పార్టీ నుండి బహిష్కరించారు. ఈ పరిస్థితుల్లో సెంగోట్టయ్యన్‌కు మద్దతునిస్తున్న మాజీ మహిళా ఎంపీ సత్యభామ, సుబ్రమణ్యం, కురింజినాథన్, కందవేల్ మురుగన్, మౌదీశ్వరన్, పీయూ ముత్తుసామి, ఎస్ఎస్ రమేష్ సహా 12 మందిని పార్టీ నుంచి ఈపీఎస్ తొలగించారు. వీరితో పార్టీకి చెందినవారెవరూ ఎలాంటి సంబంధాలు పెట్టుకోకూడదని, ఈ ఆదేశాలను పట్టించుకోనివారిపై శిక్షలు తప్పవని ఆయన హెచ్చరించారు.

బీజేపీ ఆదేశం మేరకే ఉద్వాసనలు: సెంగోట్టయ్యన్

బీజేపీ పెద్దల ఆదేశాల మేరకే అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఈపీఎస్ తన అనుచరులను పార్టీ నుండి తొలగిస్తున్నట్లు మాజీ మంత్రి సెంగోట్టయ్యన్ ఆరోపించారు. విడిపోయిన వర్గాలను విలీనం చేసేందుకు ప్రయత్నించడాన్ని తప్పుగా భావించి తనను పార్టీ నుండి తొలగించడం గర్హనీయమన్నారు. ఈపీఎస్ సహా పార్టీ నాయకులెవరినీ తాను విమర్శించలేదని, అయినా తనను, తన వర్గీయులను బద్ధ శత్రువులుగా భావించడం న్యాయమేనా అని ప్రశ్నించారు. ఈరోడ్‌లో శుక్రవారం ఉదయం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఏమూలో యువతులపై అత్యాచారాలు జరిగితే సీబీఐ విచారణకు డిమాండ్ చేసే ఈపీఎస్ మాజీ ముఖ్యమంత్రి జయలలిత వేసవి విడిది కేంద్రం కొడనాడులో జరిగిన హత్యలు, దోపిడీలపై సీబీఐ విచారణ ఎందుకు కోరలేదో ప్రజలకు స్పష్టం చేయాల్సిన అవసరం ఉందన్నారు. గతంలో బీజేపీ అధిష్ఠానం మేరకు తాను ఢిల్లీ బీజేపీ పెద్దలను కలుసుకున్నారని, ఆ నాయకులు పార్టీలో విడిపోయినవారందరినీ సమైక్యపరచమంటూ సూచించారని, దానినే తాను అమలు చేయడానికి ప్రయత్నిస్తే ఈపీఎస్ ఏకంగా పార్టీ నుండే తనను బహిష్కరించారని సెంగోట్టయ్యన్ ఆరోపించారు. చిటికీ మాటికీ, డీఎంకేది కుటుంబ పాలన అంటూ విమర్శించే ఈపీఎస్ అన్నాడీఎంకేను ఆయన కుమారుడు, అల్లుడు నడుపుతుండటం గురించి ఎందుకు నోరుమెదపకుండా ఉన్నారో వివరించాలని డిమాండ్ చేశారు.

సమాచార దృష్టి

రెండు రోజులు తాగునీటి సరఫరాకు అంతరాయం

పెరంబూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): తాగునీటి పైప్ లైన్ అనుసంధాన పనుల కారణంగా, ఈ నెల 9,10 తేదీల్లో మూడు మండలాల్లో కొళాయి ద్వారా తాగునీటి సరఫరా నిలిపివేయనున్నారు. ఈ మేరకు చెన్నై మెట్రోవాటర్ బోర్డు విడుదల చేసిన ప్రకటనలో.. తేనాంపేట మండలం ఆర్కే రోడ్డు, స్టెర్లింగ్ రోడ్డు ప్రాంతాల్లో ప్రధాన పైప్ లైన్ అనుసంధాన పనులు కారణంగా 9వ తేది ఉదయం 10 నుంచి 10వ తేది ఉదయం 10 గంటల వరకు తేనాంపేట, కోడంబాక్కం, అడయార్ మండలాల్లో, తాగునీటి సరఫరా తాత్కాలికంగా నిలిపివేయనున్నారు. ప్రజలు ముందు జాగ్రత్త చర్యగా తాగునీరు నిల్వ చేసుకోవాలని, అత్యవసర సేవలకు https://cmwssb.tn.gov.in అనే వెబ్‌సైట్ ద్వారా నమోదుచేయవచ్చు. కొళాయిల ద్వారా తాగునీరు సరఫరా చేయని ప్రాంతాలకు యధావిధిగా ట్యాంక్ లారీల ద్వారా తాగునీరు సరఫరా చేయనున్నట్లు వాటర్ బోర్డు తెలిపింది.

'అన్నా' పురస్కారానికి దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ధైర్యసాహసాలు ప్రదర్శించేవారికి రాష్ట్ర ప్రభుత్వం 'అన్నా' పేరిట పురస్కారాలు అందజేస్తోంది. రిపబ్లిక్ దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి ఈ పురస్కారాలు ప్రదానం చేయనున్నారు. రాష్ట్రానికి చెందిన వారు, ప్రభుత్వ ఉద్యోగులు (యూనిఫాం ఉద్యోగులు సహా) తలా ముగ్గురికి ఈ పురస్కారాలు ప్రదానం చేయనున్నారు. ఈ పురస్కారం కింద రూ. లక్ష చెక్, పతకం, సర్టిఫికెట్ అందజేయనున్నారు. 2026వ సంవత్సరానికి అందజేయనున్న పురస్కారానికి, ఆసక్తి కలిగిన వారు https://awards.tn.gov.in అనే వెబ్‌సైట్‌లో డిసెంబరు 15వ తేదిలోపు దరఖాస్తు చేసుకోవాలని సచివాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ

పెరంబూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కార్మిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి నిర్వహించే పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. టీఎన్‌పీఎస్సీ, యూనిఫాం సర్వీసెస్ సెలక్షన్ బోర్డు, టీచర్స్ సెలక్షన్ బోర్డు, స్టాఫ్ సెలక్షన్ కమిషన్, రైల్వే సెలక్షన్ బోర్డు, బ్యాంక్ స్టాఫ్ సెలక్షన్ కమిషన్ తదితర సంస్థలు నిర్వహించే పోటీపరీక్షలకు విద్యా ఛానల్, ఆన్‌లైన్ ద్వారా శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షణా తరగతులు ఉదయం 7 నుంచి 9 గంటలు, రాత్రి 7 నుంచి 9 గంటల వరకు విద్యా టెలివిజన్‌లో చూడవచ్చు. అలాగే, https://tamilnaducareerservices.tn.gov.in అనే వెబ్‌సైట్‌లోను శిక్షణా తరగతులు ప్రసారం చూడవచ్చని, కోర్సు నోట్స్ కూడా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని అధికారులు తెలిపారు.

లేబర్ కమిషనర్ కార్యాలయ చిరునామా మార్పు

పెరంబూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక తేనాంపేట డీఎంఎస్ ప్రాంగణంలో ఉన్న లేబర్ కమిషనర్ కార్యాలయం, దాని అనుబంధ కార్యాలయాలు ఈ నెల 10వ తేది నుంచి అన్నానగర్‌కు మారనున్నాయి. లేబర్ కమిషనర్ కార్యాలయం, దాని అనుబంధ కార్యాలయాలకు అన్నానగర్‌లో నూతనంగా నిర్మించిన భవనాలను గత నెల 25న ముఖ్యమంత్రి స్టాలిన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. ప్రస్తుతం తేనాంపేట డీఎంఎస్ ప్రాంగణంలో ఉన్న లేబర్ కమిషనర్ కార్యాలయం, చెన్నై, అదనపు లేబర్ కమిషనర్ కార్యాలయం, జాయింట్ లేబర్ కమిషనర్లు 1,2 కార్యాలయాలను కొత్త భవనంలోకి మార్చనున్నారు. ఆ ప్రకారం, అన్నానగర్ 6వ అవెన్యూలోని 'లేబర్ కమిషనర్ కార్యాలయం, లేబర్ ఆఫీసర్స్ రెసిడెన్షియల్ కాంప్లెక్స్' అనే చిరునామాలో ఈ నెల 10వ తేది నుంచి పనిచేస్తాయని అధికారులు తెలిపారు.

జేఈఈ రాసేందుకు ప్లస్ వన్ రిజిస్ట్రేషన్ నెంబరు తప్పనిసరి

పెరంబూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్స్ రాయడానికి ప్లస్ వన్ రిజిస్ట్రేషన్ నెంబరు తప్పనిసరని సీబీఎస్ఈ జాయింట్ సెక్రటరీ మనీష్ అగర్వాల్ తెలిపారు. ఈ మేరకు సీబీఎస్ఈ పాఠశాలల ప్రిన్సిపాల్స్‌కు ఆయన పంపిన సర్క్యులర్‌లో వివరాలిలా ఉన్నాయి... ప్రస్తుతం సీబీఎస్ఈ పాఠశాలల్లో టెన్త్, ప్లస్ టూ తరగతుల వార్షిక పరీక్షల టైం టేబుల్ విడుదల చేశామన్నారు. ఈ క్రమంలో జేఈఈ రాసేందుకు ప్లస్ వన్ రిజిస్ట్రేషన్ నెంబరు నమోదుచేయాలని జాతీయ పరీక్ష ఏజెన్సీ ఇప్పటికే ప్రకటించిందన్నారు. ప్లస్ టూ విద్యార్థులకు, ప్లస్ వన్ రిజిస్ట్రేషన్ నెంబరు ఇచ్చి, వారికి ఇబ్బంది లేకుండా చూడాలని సీబీఎస్ఈ జాయింట్ సెక్రటరీ తెలియజేశారు.

పెంపుడు జంతువులకు 'మైక్రో చిప్' ఏర్పాటుకు జీసీసీ ప్రత్యేక శిబిరాలు

పెరంబూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పెంపుడు జంతువులకు 'మైక్రో చిప్' అమర్చేందుకు ఆరు ప్రాంతాల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నట్లు గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) తెలిపింది. ఈ మేరకు జీసీసీ విడుదల చేసిన ప్రకటనలో వివరాలిలా ఉన్నాయి... నగరంలో శునకాలు, పిల్లులు సహా పలు జంతువులు పెంచుకుంటున్న వారు, వాటికి లైసెన్స్ తప్పనిసరిగా పొందాల్సి ఉంటుంది. లైసెన్స్ లేని జంతువుల యజమానులకు రూ.5 వేల వరకు జరిమానా విధించనున్నట్లు జీసీసీ తెలిపింది. అలాగే, జంతువుల లైసెన్స్, వేసిన టీకా తదితర వివరాలు తెలుసుకొనేలా వాటికి మైక్రో చిప్స్ అమర్చనున్నట్లు తెలిపింది. ఆ ప్రకారం, తిరువిక నగర్, పులియాంతోపు, లాయిడ్స్ కాలనీ, నుంగంబాక్కం, కన్నమ్మపేట, మీనంబాక్కం తదితర ఆరు ప్రాంతాల్లో ఈ నెల 9,16,23 తేదీల్లో (ఆదివారం) ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపింది. ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే ఈ శిబిరాలను పెంపుడు జంతువుల యజమానులు సద్వినియోగం చేసుకోవాలని జీసీసీ సూచించింది.

ట్యాంకర్‌ను ఢీకొన్న బస్సు

- బస్ డ్రైవర్ సహా ఇద్దరి మృతి


ఘటనా స్థలిలో నుజ్జునుజ్జయిన బస్సు

పెరంబూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రోడ్డు పక్కన ఆగిన లారీని బస్సు ఢీకొన్న ఘటనలో ఇద్దరు మృతిచెందగా, మరో ఏడుగురికి గాయాలయ్యాయి. మదురై నుంచి తిరుచెందూర్‌కు 25 మంది ప్రయాణికులతో గురువారం మధ్యాహ్నం ప్రభుత్వ బస్సు బయల్దేరింది. మదురై జిల్లా ముత్తురామలింగపురానికి చెందిన నల్లస్వామి (45) డ్రైవర్‌గా, రామనాథపురం జిల్లా పరమకుడికి చెందిన జయరామన్ (47) కండక్టర్‌గా విధుల్లో ఉన్నారు. సాయంత్రం 4.30 గంటల సమయంలో మదురై-తూత్తుకుడి జాతీయ రహదారిలోని సమత్తువపురం మార్గంలో వెళ్తున్న ఈ బస్సు, మరమ్మతులకు గురై రోడ్డు పక్కన ఆగి ఉన్న తాగునీటి ట్యాంకర్‌ను ఢీకొంది. ఈ ఘటనలో బస్సు ముందు భాగం నుజ్జునుజ్జుకాగా బస్సు డ్రైవర్ నల్లుస్వామి, బస్సులో ప్రయాణిస్తున్న ముంబై మాతుంగా ప్రాంతానికి చెందిన మహేష్ (31) తీవ్రంగా గాయపడి ఘటనా స్థలంలోనే మృతిచెందారు. కండక్టర్ సహా పలువురు గాయపడ్డారు. చుట్టుపక్కల వారు క్షతగాత్రులను అంబులెన్స్‌ల్లో ఎట్టాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై ఎట్టాయపురం పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

పుదుచ్చేరిలో ఈవీ బస్సు డ్రైవర్ల సమ్మె


సమ్మె కారణంగా డిపోలో ఆగిన బస్సులు

పుదుచ్చేరి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కేంద్రపాలిత రాష్ట్రం పుదుచ్చేరిలో పలు డిమాండ్ల సాధన కోసం ఎలక్ట్రిక్ బస్సు డ్రైవర్లు శుక్రవారం విధులను బహిష్కరించి సమ్మెలో పాల్గొన్నారు. స్మార్ట్ సిటీ పథకం కింద పుదుచ్చేరి ప్రభుత్వ రవాణా సంస్థ ఆధ్వర్యంలో ప్రైవేటు భాగస్వామ్యంతో రూ.23కోట్లతో కొనుగోలు చేసిన ఎలక్ట్రిక్ బస్సులను గత నెల 27న ఆ రాష్ట్ర లెఫ్టినెంట్ గవర్నర్ కైలాష్‌నాథ్ ప్రారంభించారు. ఈ బస్సులు ఆ రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాలకు నడుపుతున్నందున ప్రజల నుండి మంచి స్పందన వచ్చింది. ఈ నేపథ్యంలో, పుదుచ్చేరి రోడ్ ట్రాన్స్‌పోర్టు కార్పొరేషన్‌లో పనిచేస్తున్న డ్రైవర్లు కాకుండా బయటినుండి 75 మంది డ్రైవర్లను నెల రూ.21వేల వేతనానికి ఎంపికయ్యారు. అయితే వీరికి ప్రస్తుతం రూ.17వేలు మాత్రమే ఇస్తున్నారు. ఇదిలా వుండగా, తమిళనాడులో ఎలక్ట్రిక్ బస్సుల డ్రైవర్లకు ఇస్తున్నట్టు తమకు రాయితీలు కల్పించాలి, వేతనం పెంచాలి, డీఏ పంపిణీ చేయాలి తదితర డిమాండ్లతో 75 మంది ఈవీ బస్సు డ్రైవర్లు సమ్మెకు దిగారు. ఎలక్ట్రిక్ బస్సు సేవలు పది రోజుల క్రితమే అందుబాటులోకి వచ్చిన నేపథ్యంలో ఆ బస్సు డ్రైవర్లు సమ్మె బాటపట్టడంపై ఆ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సంఘం ప్రారంభించాలన్నా.. పోరాడాల్సిందే

- డీఎంకే ప్రభుత్వంపై సీపీఎం నేత కె.బాలకృష్ణన్ వ్యాఖ్య



ప్యారీస్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): సంఘం ప్రారంభించేందుకు కూడా డీఎంకే ప్రభుత్వంలో పోరాడాల్సిన పరిస్థితి వచ్చిందని సీపీఎం రాజకీయ వ్యవహారాల కమిటీ సభ్యుడు కె.బాలకృష్ణన్ వ్యాఖ్యానించారు. ఆయన శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో రాష్ట్రంలో ద్రావిడ పార్టీల ఆధిఖ్యాన్ని అధిగమించి లెఫ్ట్ పార్టీలు రాజకీయాల్లో నిలదొక్కుకున్నాయని, ప్రజా సమస్యలపై పోరాటాలు చేయడంలో ముందుండేది కూడా తామేనన్నారు. ఈ ఏడాది దక్షిణాది రాష్ట్రాల్లో వరిపంట దిగుబడి రెండింతలు పెరిగిందని అయితే దాన్యాన్ని కొనుగోలు చేయడంలో ప్రభుత్వం చూ పున నిర్లక్ష్యం వల్ల ధాన్యం వర్షానికి తడిసి అన్నదాతలకు నష్టాన్ని మిగిల్చిందన్నారు. అత్యాచారానికి గురవుతున్న మహిళలకు భద్రతను పటిష్ఠం చేయడంతో పాటు పోలీస్‌శాఖ తమ పనితీరును వేగవంతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారంలో డీఎంకే ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు సరిగా లేదని, వాస్తవంగా ఒక సంఘం ప్రారంభించేందుకు కూడా పోరాడి సాధించుకోవల్సిన పరిస్థితి వచ్చిందని వ్యాఖ్యానించారు. ఈ ప్రభుత్వం శ్రామిక వర్గాలకు ప్రాధాన్యత ఇవ్వడంలో వెనుకంజ వేస్తోందని విమర్శించారు. మతవాద బీజేపీని ఓడించాలన్న దృష్టితోనే తాము ద్రావిడ సిద్ధాంతాన్ని నమ్ముతున్న డీఎంకేతో పొత్తు కుదుర్చుకుంటున్నామని, అయితే దీనిని ఆ పార్టీ అర్థం చేసుకోవాలని బాలకృష్ణన్ సూచించారు.

తిరుపతి వెళ్లే రైళ్ల వేళల్లో మార్పులు

పెరంబూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): తిరుపతి వెళ్లే నాలుగు మెము రైళ్లు గురువారం నుంచి ఫిబ్రవరి 5వ తేది వరకు తిరుచానూరు వరకు మాత్రమే నడుస్తాయి. ఈ మేరకు దక్షిణ రైల్వే విడుదల చేసిన ప్రకటనలో వివరాలిలా ఉన్నాయి...

- అరక్కోణం నుంచి తిరుపతికి ఉదయం 9.15 గంటలకు వెళ్లే రైలు తిరుచానూరు వరకు మాత్రమే వెళ్తుంది. మరుమార్గంలో, అరక్కోణం వెళ్లే మెము సాయంత్రం 3.40 గంటలకు తిరుచానూరు నుంచి బయల్దేరుతుంది.
- చెన్నై సెంట్రల్ నుంచి తిరుపతికి ఉదయం 9.50 గంటలకు వెళ్లే రైలు తిరుచానూరు వరకు మాత్రమే వెళ్తుంది. మరుమార్గంలో, మధ్యాహ్నం 1.25 గంటలకు తిరుపతి నుంచి వెళ్లే రైలు తిరుచానూరు నుంచి బయల్దేరనుంది.

తాత్కాలికంగా వల్లలార్ నగర్ బస్టాండ్ మార్పు

పెరంబూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక వల్లలార్ నగర్ (మింట్) బస్టాండ్‌ను రూ.10 కోట్లతో ఆధునికంగా నిర్మించనున్న నేపథ్యంలో, శుక్రవారం నుంచి ఈ బస్టాండ్‌ను తాత్కాలికంగా మార్పు చేశారు. ఈ మేరకు ఎంటీసీ విడుదల చేసిన ప్రకటనలో వివరాలిలా ఉన్నాయి.. వల్లలార్ నగర్ బస్టాండ్‌ను చెన్నై మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (సీఎండీఏ) రూ.10 కోట్లతో ఆధునికీకరించనుంది. ఈ పనులు వచ్చే ఏడాది ఏప్రిల్‌లోగా పూర్తిచేసి కొత్త బస్టాండ్ అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించింది. ఈ కారణంగా, వల్లలార్ నగర్ నుంచి బయల్దేరే 57,57 ఎక్స్, 57ఏ, 48బి, 48 ఎక్స్, 48సి, 48కె, 48బి, 547ఏ, 592బి, 56ఏ, 36ఎం తదితర బస్సులు, వల్లలార్ నగర్ బస్టాండ్‌కు బదులు కార్పొరేషన్ మండల కార్యాలయం ఎదురుగా ఉన్న తాత్కాలిక బస్టాండ్ నుంచి బయల్దేరనున్నాయి. అదే సమయంలో, 37, 37జి, 59 తదితర బస్సులు యధావిధిగా వల్లలార్ నగర్ బస్టాండ్ నుంచి బయల్దేరుతాయని ఎంటీసీ తెలిపింది.

టెన్త్, ప్లస్ టూ పాఠ్యాంశాలు త్వరగా పూర్తిచేయాలి

పెరంబూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): టెన్త్, ప్లస్ టూ పాఠ్యాంశాలు త్వరగా పూర్తిచేయాలని పాఠశాల విద్యాశాఖ సూచించింది. రాష్ట్ర పాఠ్య ప్రణాళికలో టెన్త్, ప్లస్ వన్, ప్లస్ టూ తరగతులకు పబ్లిక్ పరీక్షలు నిర్వహిస్తుండగా, ఈ ఏడాది నుంచి ప్లస్ వన్ తరగతికి పరీక్షలు మినహాయింపు కల్పించారు. విద్యార్థుల సౌకర్యార్థం, టెన్త్, ప్లస్ టూ పబ్లిక్ పరీక్షల టైం టేబుల్ ఇటీవల విడుదల చేశారు. ఈ నేపథ్యంలో, పాఠశాల విద్యాశాఖ అన్ని జిల్లాల ప్రధాన విద్యాధికారులకు పంపిన సర్క్యులర్‌లో నవంబరు, డిసెంబరు నెలల్లో వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం తెలియజేసిందన్నారు. వర్షాల సమయంలో పాఠశాలలకు సెలవులు ప్రకటించే అవకాశం ఉన్న కారణంగా, టెన్త్, ప్లస్ టూ తరగతుల పాఠ్యాంశాలు త్వరగా ముగించాలని, అనంతరం విద్యార్థుల సందేహాలు నివృత్తి చేయడం, మోడల్ పరీక్షలు నిర్వహణ తదితరాలు చేపట్టాలని పాఠశాల విద్యాశాఖ సర్క్యులర్‌లో తెలిపింది.

డీజీపీ నియామక వ్యవహారం.. ప్రభుత్వానికి సుప్రీం నోటీసు

అడయార్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): డీజీపీ నియామక వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వానికి సుప్రీం కోర్టు నోటీసు జారీచేసింది. రాష్ట్ర డీజీపీగా వ్యవహరించిన శంకర్ జివాల్ ఆగస్టు 31వ తేది పదవీవిరమణ పొందారు. ఆయన తర్వాత కొత్త డీజీపీగా ఎవరిని ఎంపిక చేయకపోవడంతో, డీజీపీ హోదాలో సీనియర్ ఐపీఎస్ అధికారి జి.వెంకట్రామన్‌ను ఆగస్టు 31వ తేది రాష్ట్ర ప్రభుత్వం తాత్కాలికంగా నియమించింది. ఈ నేపథ్యంలో, రాష్ట్రానికి కొత్త డీజీపీ నియమించకుండా ఇన్‌చార్జి డీజీపీ నియామకాన్ని వ్యతిరేకిస్తూ సుప్రీంకోర్టులో హెన్రీ టిబెన్ కేసు వేశారు. ఈ కేసు విచారించిన ప్రధాన న్యాయమూర్తి బీఆర్ కవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం, పోలీసు శాఖ డీజీపీని సత్వరం నియమించాలని ఆదేశించింది.. ముఖ్యంగా, యూపీఎస్సీ సిఫారసులు అందిన వెంటనే రాష్ట్ర డీజీపీ ఎంపిక చేపట్టాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ క్రమంలో, పోలీసు శాఖ డీజీపీ పేరు ఖరారు చేసిన యూపీఎస్సీ, రాష్ట్ర ప్రభుత్వానికి అందజేసిన తరుణంలో, కొత్త డీజీపీ నియామకం చేపట్టలేదు. ఈ క్రమంలో, ఉత్తర్వులు అమలు చేయని రాష్ట్ర ప్రభుత్వంపై కోర్టు ధిక్కరణ చర్యలు చేపట్టాలంటూ కిషోర్ కృష్ణస్వామి పిటిషన్ వేశారు. ఈ పిటిషన్ శుక్రవారం విచారించిన సుప్రీంకోర్టు, కోర్టు ధిక్కార పిటిషన్‌పై మూడు వారాల్లో అఫిడవిట్ దాఖలుచేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసు జారీచేసింది.

వృద్ధుల హత్యకేసు... కాల్పులు జరిపి నిందితుడి అరెస్టు


గాయపడిన అయ్యనార్‌ను వార్డుకు తరలిస్తున్న పోలీసులు

చెన్నై, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): సేలం జిల్లా సంగగిరి సమీపంలో ఇద్దరు వృద్ధురాళ్లను దారుణంగా హతమార్చి, వారు ధరించిన నగలను దోపిడీ చేసిన నిందితుడిని పోలీసులు తుపాకీతో కాల్చి అరెస్టు చేశారు. మకుటన్‌చావిడి సమీపం తూతనూరు, కాట్టు వలవు ప్రాంతంలో క్వారీ నీటి గుంతలో పెరియమ్మ (75), పావాయిన్ (70) అనే మహిళల శవాలు గత సోమవారం లభించాయి. పోలీసుల విచారణలో వారిని గుర్తు తెలియని వ్యక్తులు హతమార్చి, బంగారు నగలను దోచుకెళ్లినట్లు తెలిసింది. ఈ హత్యకేసులో ప్రధాన నిందితుడైన అయ్యనార్ ఆచూకీ కోసం ముమ్మరంగా గాలించారు. చివరకు శుక్రవారం వేకువజాము అయ్యనార్ ఒరుక్కామాలై ప్రాంతంలో ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. వెంటనే మకుటన్ చావిడి ఎస్‌ఐ సెంథిల్‌కుమార్ తన సిబ్బందితో హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. పోలీసులను చూడగానే అయ్యనార్ వేట కొడవళ్లతో వారిపై దాడికి దిగాడు. ఆ దాడిలో ఎస్‌ఐ కన్నన్ కుడి చేయికి తీవ్ర గాయమైంది. దీంతో ఆత్మసంరక్షణ కోసం పోలీసులు కాల్పులు జరిపారు. ఆ కాల్పులలో అయ్యనార్ కుడికాలి మోకాలిలో తూటా దూసుకెళ్లడంతో పడిపోయాడు.. వెంటనే అతడిని పోలీసులు నిర్బంధించి చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు.

'సర్'పై రాజకీయ ప్రమేయం లేకుండా చూడండి

- కలెక్టర్‌కు అన్నాడీఎంకే నేతల విజ్ఞప్తి

తిరుత్తణి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)పై రాజకీయ ప్రమేయం లేకుండా చూడాలని తిరువళ్లూరు జిల్లా అన్నాడీఎంకే నాయకులు శుక్రవారం కలెక్టర్ ప్రతాప్‌కు విజ్ఞప్తి చేశారు. మాజీమంత్రి బీవీ.రమణ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, సర్ ప్రక్రియలో బీఎల్వోలు సర్వే నిర్వహిస్తున్న సమయంలో డీఎంకే నేతల్లో కొంతమంది వారిని అడ్డుకుంటున్నారని తెలిపారు. సర్ పనుల్లో రాజకీయ నేతల ప్రమేయాలు లేకుండా సర్వే నిర్వహింపజేయాలని కలెక్టర్‌ని కోరినట్లు ఆయన తెలిపారు.

ఫోర్ లేన్ నిర్మాణానికి శంకుస్థాపన


శంకుస్థాపన కార్యక్రమంలో మంత్రి ఈవీ.వేలు

వేలూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా అబ్దుల్లాపురం-తిరుపత్తూరు జాతీయ రహదారిలో ఫోర్‌లేన్ నిర్మాణానికి రాష్ట్రప్రభుత్వం రూ.50కోట్లు కేటాయించింది. ఈ నేపథ్యంలో, శుక్రవారం ఉదయం రాష్ట్ర పీడబ్ల్యూడీ శాఖమంత్రి ఈవీ.వేలు చేతుల మీదుగా నిర్మాణ పనులకు శంకుస్థాపన జరిగింది. వేలూరు జిల్లా అబ్దుల్లాపురం నుండి ఆసనంపట్టి, తిరుపత్తూరు మీదుగా వెళ్లే ఈ ఫోర్‌లేన్ రహదారి పనులను సకాలంలో పూర్తిచేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ కదిర్ ఆనంద్, అనైకట్టు ఎమ్మెల్యే నందకుమార్, పంచాయతీ అధ్యక్షుడు బాబు, అనైకట్టు కమిటీ అధ్యక్షుడు భాస్కరన్, డీఎంకే నిర్వాహకులు చిత్రా, కుమర పాండియన్, కృష్ణమేనన్, శివలింగం, ఇంజనీర్లు మురళీ, ధనశేఖరన్, అశోకన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కోడంబాక్కంలో 'నలం కాక్కుం స్టాలిన్' శిబిరం

అడయార్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోడంబాక్కం మండలంలో శనివారం 'నలం కాక్కుం స్టాలిన్' ప్రత్యేక వైద్యశిబిరం జరుగనుంది. ఈ మేరకు జీసీసీ ఒక ప్రకటన విడుదల చేసింది. కోడంబాక్కం మండలం అశోక్ నగర్‌లోని డా.కేకే నిర్మల బాలికల మహోన్నత పాఠశాల ప్రాంగణంలో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించే శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జీసీసీ విజ్ఞప్తి చేసింది.

కర్ణాటక 13.78 టీఎంసీల నీరు అందించాలి

- కావేరి నిర్వహణ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి

అడయార్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో కావేరి జల నిర్వహణ మండలి 45వ సమావేశం మండలి చైర్మెన్ హల్దార్ నేతృత్వంలో గురువారం జరిగింది. సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి జయకాంతన్ సహా అధికారులు స్థానిక సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. కర్ణాటక రాష్ట్రంలోని జలాశయాల్లో నీటిమట్టాలు పెరుగుతున్న కారణంగా, సుప్రీంకోర్టు ఉత్తర్వులతో నవంబరు నెలకు రాష్ట్రానికి అందించాల్సిన 13.78 టీఎంసీల నీటిని కర్ణాటక విడుదల చేయాలని కోరారు. కాగా ఈ ఏడాది పరిమితికి మించి నీరు వదిలినట్లు కర్ణాటక అధికారులు సమావేశంలో పేర్కొన్నారు.

క్యాంటీన్‌లో గ్యాస్ లీకై అగ్నిప్రమాదం

అడయార్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక పూందమల్లి సమీపం వయలానల్లూర్ గ్రామంలోని క్యాంటీన్‌లో శుక్రవారం అగ్నిప్రమాదం సంభవించింది. ఈ క్యాంటీన్ నుంచి శ్రీ పెరుంబుదూర్, చుటుపక్కల కర్మాగారాల్లో పనిచేసే కార్మికులకు ఆహారం తయారుచేసి సరఫరా చేస్తుంటారు. శుక్రవారం ఉదయం వంట చేస్తున్న సమయంలో హఠాత్తుగా గ్యాస్ లీకై మంటలు చెలరేగాయి. గమనించిన కార్మికులు బయటకు పరుగులు తీశారు. ఆవడి, పూందమల్లి అగ్నిమాపక సిబ్బంది మంటలు అదుపుచేశారు.

టీవీకే నిరాహారదీక్ష

పెరంబూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): జాలర్ల విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరును ఖండిస్తూ తమిళగ వెట్రి కళగం (టీవీకే) ఆధ్వర్యంలో శుక్రవారం నాగపట్టణంలో నిరాహారదీక్ష చేపట్టారు. సరిహద్దులు దాటి చేపల వేట సాగిస్తున్నారని ఆరోపిస్తూ, తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాలకు చెందిన జాలర్లను శ్రీలంక నావికా దళం అరెస్ట్ చేస్తోంది. ఈ క్రమంలో జాలర్ల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని టీవీకే ఆధ్వర్యంలో నిరాహారదీక్ష చేపట్టారు. ఈ దీక్షలో టీవీకే సంయుక్త ప్రధాన కార్యదర్శి రాజ్‌మోహన్, నాగపట్టణం జిల్లా కార్యదర్శి సుకుమారన్ సహా పెద్దసంఖ్యలో కార్యకర్తలు, జాలర్లు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని చంపే యత్నమే 'సర్'

- డీఎంకే ఎంపీ కనిమొళి

పెరంబూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) పేరుతో ప్రజాస్వామ్యాన్ని చంపేందుకు యత్నిస్తున్నారని డీఎంకే ఎంపీ కనిమొళి వ్యాఖ్యానించారు. తూత్తుకుడిలో శుక్రవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ... ఎన్నికల ముందు 'సర్' అత్యవసరంగా అమలుచేయాల్సిన అవసరం లేదన్నారు. నిజాయితీగా, న్యాయంగా నిర్వహించాలనే ఉద్దేశం ఉంటే, తగినంత సమయం ఇచ్చి నిర్వహించేవారని అన్నారు. సర్ తీరును బీహార్‌లో స్పష్టంగా చూశామని, ఈ ప్రక్రియ మహారాష్ట్ర, హరియాణా రాష్ట్రాల్లో కూడా ఉందన్నారు. ఇటీవల కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ, సర్ పేరుతో జరుగుతున్న అన్యాయాలు గణాంకాలతో వివరించారని, అందుకు ముఖ్యమంత్రి స్టాలిన్ పూర్తి మద్దతు తెలిపారని గుర్తుచేశారు. సర్‌కు వ్యతిరేకంగా డీఎంకే, మిత్రపక్షాలు ఈ నెల 11న ఆందోళనలు చేపట్టనున్నట్లు కనిమొళి తెలిపారు.

ఆమ్‌స్ట్రాంగ్ హత్య కేసు రికార్డులు సీబీఐకి అప్పజెప్పాలి

- హైకోర్టులో పిటిషన్

ప్యారీస్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆమ్‌స్ట్రాంగ్ హత్యకేసు రికార్డులను సీబీఐకి అప్పగించాలని కోరుతూ బీఎస్పీ తరుపున మద్రాస్ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. గత ఏడాది జూలై 5న పెరంబూరు సమీపంలో ఆమ్‌స్ట్రాంగ్‌ను హతమార్చిన ఘటనలో పోలీసులు 27 మందిని అరెస్టు చేశారు. ఈ కేసు విచారణ చెన్నై ప్రిన్సిపల్ సెషన్స్‌కోర్టులో కొనసాగుతున్న నేపథ్యంలో, విచారణను సీబీఐకి అప్పజెప్పాలని కోరుతూ ఆమ్‌స్ట్రాంగ్ సోదరుడు ఇమ్మానువేల్ హైకోర్టులో పిటిషన్ వేశారు. విచారణ జరిపిన న్యాయస్థానం ఈ కేసును సీబీఐకి అప్పగించాలని రాష్ట్ర పోలీసు శాఖకు ఉత్తర్వులు జారీచేసింది. దర్యాప్తు చేపట్టిన సీబీఐ అధికారులకు రాష్ట్రపోలీసులు ఆమ్‌స్ట్రాంగ్ హత్యకేసుకు సంబంధించిన పత్రాలను అప్పగించని కారణంగా, విచారణకు సంబంధించిన దస్తావేజులను వెంటనే సీబీఐకి అప్పగించేలా ఉత్తర్వులు జారీ చేయాలని కోరుతూ ఇమ్మానువేల్ దాఖలు చేసిన పిటిషన త్వరలో విచారణకు రానుంది.

పాఠశాల భవన నిర్మాణానికి శంకుస్థాపన


శంకుస్థాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే చంద్రన్

తిరుత్తణి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా పొదటూర్‌పేటలో ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో అదనపు గదుల నిర్మాణానికి శుక్రవారం తిరుత్తణి ఎమ్మెల్యే ఎస్.చంద్రన్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంద్రన్ మాట్లాడుతూ, పొదటూర్‌పేటలో పాఠశాల పాత భవనం శిథిలావస్థకు చేరుకుందని విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల ఉపాధ్యాయులు తనకు విజ్ఞప్తి చేశారన్నారు. దీనిపై రాష్ట్రప్రభుత్వానికి తెలుపగా పాఠశాల భవన నిర్మాణానికి రూ.2.43కోట్లు కేటాయించిందని తెలిపారు. ఈ నేపథ్యంలో, శుక్రవారం ఉదయం పాఠశాల భవనానికి శంకుస్థాపన చేశామన్నారు. ఈఈలు మురళీ, డీఎంకే మండల కార్యదర్శి బాబు, జిల్లా వీవర్స్ అసోసియేషన్ ఆర్గనైజర్ ఉదయసూరియన్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కరుణానిధికి ఘన నివాళి


కరుణానిధికి నివాళులర్పిస్తున్న ఎంపీ కదిర్ ఆనంద్

వేలూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): వేలూరు దక్షిణ జిల్లా బాధ్యతలను ఎంపీ కదిర్ ఆనంద్‌కు ఇటీవల ముఖ్యమంత్రి స్టాలిన్ అప్పగించారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం వేలూరులోని చిత్తూరు బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన దివంగత మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి చిత్రపటానికి ఆయన నివాళులర్పించారు. అనంతరం జిల్లా నిర్వాహకులతో సమావేశమయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా డీఎంకే కార్యదర్శి శరవణన్, 1వ డివిజన్ అధ్యక్షురాలు పుష్పలత, కౌన్సిలర్ అన్బుమణి తదితరులు పాల్గొన్నారు.

మత్తుబిళ్లలు తరలిస్తున్న రాజస్థాన్ యువకుడి అరెస్ట్



వేలూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మత్తుబిళ్లలు తరలిస్తున్న ఘటనలో రాజస్థాన్‌కు చెందిన ఓ యువకుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. వేలూరు జిల్లా గుడియాత్తం సమీపంలోని పెరుంపాడి ప్రాంతంలో గడిచిన నెల రోజుల్లో మాదకద్రవ్యాల రవాణా కేసులో 16 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి చెక్‌పోస్టు వద్ద తనిఖీ చేస్తున్న పోలీసులు అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఓ యువకుడిని తనిఖీ చేశారు. అతడి బ్యాగులో 11వేల మత్తుబిళ్లలు గుర్తించి స్వాధీనం చేసుకుని అతడిని అరెస్ట్ చేశారు. విచారణలో అతను రాజస్థాన్ రాష్ట్రం జోధ్‌పూర్‌కు చెందిన ప్రతాప్ చౌదరిగా గుర్తించారు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు కోర్టు ఉత్తర్వుల మేరకు అతడిని రిమాండ్‌కు తరలించారు.

కోర్టు ఆవరణలో మహిళ ఆత్మహత్యాయత్నం

తిరుత్తణి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి కోర్టు ప్రాంగణంలో గురువారం ఓ మహిళ ఆత్మహత్యకు యత్నించింది. ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆమె నిప్పంటించుకోబోయింది. గమనించిన కొంతమంది న్యాయవాదులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఆమె న్యాయవాదులతో మాట్లాడుతూ, తిరుత్తణిలోని కాశీనాథపురంలో తన కుమారుడు పవన్ (45) నివాసం ఉంటున్నాడని, అతడిని పలు కేసుల కారణంగా పోలీసులు అరెస్టు చేశారని. ఇటీవల మళ్లీ పోలీసులు అరెస్టు చేసి తీసుకెళ్లారని వాపోయింది. తన కుమారుడు ఎలాంటి తప్పు చేయలేదని, అధికారులు తన కుమారిడిని విడిపించి తనకు న్యాయం చేయాలని ఆమె కోరింది.

కొలీజియం రామజ్జిని ఫెలోగా శ్రీహెర్ ప్రొఫెసర్


డాక్టర్ విద్యా వేణుగోపాల్

చెన్నై, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోరూర్‌లోని 'శ్రీ రామచంద్ర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్' (శ్రీహెర్) ఎన్విరాన్‌మెంట్ హెల్త్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్ డాక్టర్ విద్యా వేణుగోపాల్ ఇటలీలోని కొలీజియం రమజ్జిని ఫెలోగా ఎన్నికయ్యారు. కొలీజియం రమజ్జిని అనేది వృత్తిపరమైన, పర్యావరణ ఆరోగ్యంలో ప్రముఖ నిపుణులతో కూడిన స్వతంత్ర అంతర్జాతీయ అకాడమీ. ఇది 40కి పైగా దేశాల నుంచి 180 మంది సభ్యులను కలిగి వుంది. వారు సమాజ ఆరోగ్యాన్ని ప్రభావితం చేసే విధానాలపై శాస్త్రీయ ఆధారిత మార్గదర్శకత్వాన్ని అందిస్తారు. ఇప్పుడు ఈ కొలీజియం రమజ్జినికి ప్రొఫెసర్ విద్య ఎన్నికయ్యారు.

నటుడు శ్రీకాంత్‌కు ఈడీ మళ్లీ సమన్లు

పెరంబూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): నటుడు శ్రీకాంత్ విచారణకు హాజరుకావాలంటూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) రెండో సారి సమన్లు పంపింది. మాదకద్రవ్యాల వినియోగం కేసులో నటులు శ్రీకాంత్, కృష్ణలను పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం వారు బెయిలుపై విడుదలయ్యారు. ఈ కేసులో విదేశీ మాదకద్రవ్యాల ముఠాలతో సంబంధాలున్నాయని, లక్షలాది రూపాయలు చట్టవిరుద్ధంగా బదిలీ అయ్యాయనే కారణంగా శ్రీకాంత్, కృష్ణలపై ఈడీ కేసు నమోదుచేసింది. ఈ కేసుకు సంబంధించి శ్రీకాంత్ అక్టోబరు 28న, కృష్ణ 29వ తేది విచారణకు హాజరుకావాలని ఈడీ సమన్లు పంపింది. కృష్ణ విచారణకు హాజరుకాగా, శ్రీకాంత్ హాజరుకాలేదు. ఆయన తరపున హాజరైన న్యాయవాది, మరో తేదీ విచారణకు హాజరవుతారన్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 11వ తేది విచారణకు హాజరుకావాలని శ్రీకాంత్‌కు ఈడీ సమన్లు జారీచేసింది.

చిత్రజ్యోతి

సినిమాలో ఏదీ శాశ్వతం కాదు



● నందితా శ్వేత

అందాల భామ నందితా శ్వేత 'అట్టకత్తి' మూవీ ద్వారా కోలీవుడ్‌కు పరిచయమై 'ఎదిర్‌నీచ్చల్‌', 'ఇదర్కుదానే ఆశైపట్టాయ్ బాలకుమారా', 'ముండాసుపట్టి', 'అసురవధం', 'కపటధారి', 'రత్తం', 'రణం' తదితర చిత్రాల్లో నటించి తమిళ ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంది. ప్రస్తుతం తెలుగు, కన్నడ సినిమాల్లోనూ నటిస్తోంది. కొత్తగా వెబ్‌సిరీస్‌లో నటించేందుకు ఒప్పందం కుదుర్చుకుంది. ఇప్పటి వరకు తన సినీ జైత్రయాత్రను గురించి ఆ బ్యూటీ మీడియాతో ముచ్చటించింది. సినిమాలంటే తనకు ఎంతో ఇష్టమని, చిన్నప్పటి నుండి సినిమాలు చూడటం అలవాటని చెబుతూ ఎవరైనా లక్ష్యం ఏమిటని అడిగితో సినిమాల్లో నటించడమేనని టక్కున బదులిచ్చేదానినన్నారు. సినిమాల్లో ఏదీ శాశ్వతం కాదనే విషయాన్ని గుర్తుంచుకోవాలని, ఓ మూవీ హిట్‌కొడితే మనమే పెద్ద స్టార్‌లమని గర్వపడకూడదని తెలిపింది. ఒకే మూవీతో ఎవరూ కోటీశ్వరులు కాలేరని, అంచెలంచెలుగా మంచి పాత్రలను ఎంపిక చేసుకుని నటిస్తేనే టాప్ పొజిషన్‌కు వస్తారని చెబుతోంది.. ఫస్ట్‌మూవీలో నటించాక మూడేళ్ల చదివేందుకు వెళ్ళిపోయానని, కాలేజీ చదువులు పూర్తయిన తర్వాత తొలిసారిగా నటించిన తమిళ మూవీయే 'అట్టకత్తి' అని చెప్పింది. సినిమాల్లో తాను నేర్చుకున్న పాఠం ఏమిటంటే ఓర్పుగా ఉండటమేనని నవ్వుతూ తెలిపింది. స్టోరీకి అవసరమయితే గ్లామరస్ పాత్రలో నటించేందుకు కూడా తాను రెడీ అని నందితా శ్వేతా స్పష్టం చేసింది.

'నాయగన్' స్టోరీ సీన్ బై సీన్ చెప్పగలను!

● జస్టిస్ ఎన్.సెంథిల్‌కుమార్



స్టార్ డైరెక్టర్ మణిరత్నం దర్శకత్వంలో కమల్‌హాసన్ హీరోగా నటించిన నాయగన్ మూవీ రీ రిలీజ్‌పై స్టే విధించలేమని ప్రకటించిన హైకోర్టు న్యాయమూర్తి ఆ మూవీ తనకు బాగా నచ్చిందని, ఇప్పటికీ ఆ చిత్ర కథను సీన్‌బై సీన్‌గా చెప్పగలనని వ్యాఖ్యానించారు. 1987లో రిలీజైన ఈ మూవీ ద్వారా శరణ్యా హీరోయిన్‌గా పరిచయమైంది. జనకరాజ్, నాజర్, ఢిల్లీ గణేష్, నిళల్‌గళ్ రవి, విజయన్, ఎంవీ వాసుదేవరావ్, రాజా కృష్ణమూర్తి, టినూ ఆనంద్ ఇతర తారాగణం. ఈ చిత్రం ద్వి శతదినోత్సవాన్ని కూడా జరుపుకుంది. ప్రస్తుతం ఈ మూవీకి మరిన్ని కొత్త మెరుగులతో తీర్చిదిద్ది కమల్ హాసన్ బర్త్‌డే సందర్భంగా గురువారం రిలీజ్ చేయాలనుకున్నారు. ఆ లోగా మూవీ రీ రిలీజ్‌పై స్టే విధించాలని కోరుతూ ఎస్ఆర్ ఫిలిమ్ ఫ్యాక్టరీ యజమాని ఎస్ఆర్ రాజన్ మద్రాసు హైకోర్టులో పిటిషన్ వేశారు. నాయకన్ చిత్రం రిలీజ్ హక్కులు తమ సంస్థకే ఉన్నప్పటికీ, వీఎస్ ఫిలిమ్స్ అక్రమంగా పొరుగు రాష్ట్రాల్లోనూ రిలీజ్ చేయడానికి సిద్ధమయ్యారని ఆ పిటిషన్‌లో ఆరోపించారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయమూర్తి ఎన్.సెంథిల్‌కుమార్ ఆ మూవీ రిలీజ్‌ను నిలుపుదల చేస్తూ స్టే విధించలేమని ప్రకటించారు. ఒప్పంద ప్రాతిపదికగానే ఈ మూవీ విడుదల చేస్తుండటం వల్ల స్టే విధించాల్సిన అవసరం లేదన్నారు. అంతే కాకుండా 'నాయగన్' మూవీని తాను 16 సార్లు చూశానని, ఇప్పటికీ ఆ మూవీ స్టోరీ తనకింకా గుర్తుందని, ఆ స్టోరీ సీన్‌బై సీన్‌గా చెప్పగలనని న్యాయమూర్తి సెంథిల్‌కుమార్ పేర్కొన్నారు.

విజయ్ మూవీ 'జననాయగన్' కొత్త పోస్టర్ రిలీజ్


'జననాయగన్' పోస్టర్

హీరో విజయ్ నటిస్తున్న 'జననాయగన్' మూవీ కొత్త పోస్టర్ రిలీజై సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. కేవీఎన్ సంస్థ నిర్మిస్తున్న ఈ మూవీలో విజయ్‌తోపాటు పూజా హెగ్డే, బాబీ డియోల్, గౌతంమేనన్, ప్రియమణి, నరేన్, మమితా బైజూ తదితరులు నటించారు. హెచ్ వినోద్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ మూవీ వచ్చే యేడాది పొంగల్ సీజన్‌లో జనవరి 9న రిలీజవుతోంది. విజయ్ పాల్గొన్న కరూర్ రోడ్‌షోలో తొక్కిసలాటల్లో 41 మంది మృతి చెందటంతో ఈ చిత్రం గురించిన వివరాలేవీ వెల్లడించలేకపోయారు. ప్రస్తుతం విజయ్ రాజకీయాల్లో మళ్ళీ చురుకుగా పాల్గొనడంతో ఈ మూవీ పోస్టర్ విడుదల చేశారు. జనం మధ్య నిలచి, గాగుల్స్ పెట్టుకుని, మెలివేసిన మీసాల గెటప్‌తో విజయ్ నిలిచి ఉంటే ఆయన చుట్టు జనం చేసి చేతులతో ఆప్యాయంగా నిమురుతున్న దృశ్యంతో ఈ పోస్టర్‌ను రూపొందించారు.

ఈ ఛాన్స్ నా లైఫ్‌లో టర్నింగ్ పాయింట్

● 'కుంకీ' హీరో మది

ప్రభుసాల్మన్ దర్శకత్వంలో 'కుంకీ-2' మూవీలో హీరోగా నటించే ఛాన్స్ రావటం తన అదృష్టమని, ఈ మూవీ తన లైఫ్‌కు టర్నింగ్ పాయింట్ అవుతుందని ఆ చిత్రం హీరో మది తెలిపారు. ఈ నెల 14న ఆ మూవీ రిలీజ్ అవుతున్న సందర్భంగా సినిమా యూనిట్ సభ్యులతో ప్రెస్‌మీట్ ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో మది మాట్లాడుతూ స్టార్ డైరెక్టర్ లింగుసామి, బోస్ కలిసి తనకు హీరో ఛాన్స్ ఇవ్వడం మరచిపోలేనన్నారు. డైరెక్టర్ ప్రభు సాల్మన్ మాట్లాడుతూ తనను అభినందించడం కోసం ప్రముఖ దర్శకులంతా రావటం తనకెంతో ఆనందంగా ఉందన్నారు. దర్శకులు మడోన్ అశ్విన్, బృందా సారథి, చరణ్, మ్యూజిక్ డైరెక్టర్ కే ప్రసన్నా, నిర్మాత జయంతిలాల్ కట్టా తదితర ప్రముఖులంతా 'కుంకీ-2' సక్సెస్ ఖాయమని అభినందించారు.


ప్రెస్‌మీట్‌లో పాల్గొన్న దర్శకులు, హీరో మది తదితరులు


సహోద్యోగులతో శివశంకరి

అతివలు.. అన్ని రంగాల్లో అగ్రగణ్యులు


టూవీలర్ విడిభాగాలను ప్రదర్శిస్తున్న శివశంకరి

● ఎలక్ట్రిక్ వాహనాల రంగంలో రాణిస్తున్న శివశంకరి
● కాలుష్యరహిత పర్యావరణం కోసం తపించే పారిశ్రామికవేత్త

దేశంలో వాహనాల సంఖ్య విపరీతంగా పెరుగుతున్న ఈ రోజుల్లో, మారుతున్న కాలానికనుగుణంగా పర్యావరణ పరిరక్షణకు విద్యుత్, సీఎన్‌జీతో నడిచే వాహనాలను విరివిగా తయారు చేస్తున్నారు. ఎలక్ట్రిక్ వాహనాలకు డిమాండ్ పెరుగుతున్న నేటి పరిస్థితుల్లో కోవై జిల్లాకు చెందిన శివశంకరి సాధారణ వాహనాలను ఎలక్ట్రిక్ వాహనాలుగా మార్చడానికి ఎంతో కృషి చేస్తోంది. ఈవీ వాహన తయారీ రంగంలో రాణిస్తున్న శివశంకరి పన్నీర్ విజయ ప్రస్థానం నేటి తరుణిలో ...

- టి.నగర్, ఆంధ్రజ్యోతి

తరుణి


కొత్త రకం ఎలక్ట్రిక్ టూవీలర్ ఆవిష్కరణ సభలో అవార్డు అందుకుంటున్న శివశంకరి

కోయంబత్తూరు గ్రామీణ ప్రాంతాల్లో అమ్మాయిలకు 15 ఏళ్లకే పెళ్ళిళ్లు చేసే చేనేత కుటుంబంలో శివశంకరి జన్మించారు. ఆ కుటుంబంలో ఇంజనీరింగ్ పట్టా అందుకున్న మొట్టమొదటి మహిళగా గుర్తింపు పొందారు. సాధారణ వాహనాలను విద్యుత్ వాహనాలుగా మార్చే సాంకేతిక పరిజ్ఞానాన్ని కూడా ఆమె అందిపుచ్చుకున్నారు. ఫలితంగా 2018లో కోవై జిల్లా అన్నూర్ సమీపంలోని సెంతాంపాళయంలో 'ఏఆర్4 టెక్' సంస్థ నెలకొల్పి, 2021లో 35 మంది తో ఆ కంపెనీ తన ఉత్పత్తులను ప్రారంభించింది

'ఏఆర్4 టెక్ ప్రైవేట్ లిమిటెడ్' కర్మాగారాన్ని నడుపుతున్న శివశంకరి మహిళలకు సాంకేతిక పరిజ్ఞానం తక్కువ అనే విమర్శలకు దీటైన రీతిలో సమాధానం ఇస్తూ... వృత్తిపరమైన నైపుణ్యంతో ఆటోమొబైల్ రంగంలో ముందుకు దూసుకెళ్తోంది. ప్రస్తుతం ఎలక్ట్రిక్ వాహన రంగంలో ప్రపంచంలో తనకంటూ ప్రత్యేకమైన స్థానం సంపాదించు కుంటోంది. ఒకప్పుడు పురుషులు ఆధిపత్యం వహించిన రంగాల్లో మహిళలకు అవకాశం కల్పించడమే ప్రధాన లక్ష్యంగా స్థిరమైన భవిష్యత్ దిశగా ఆమె ప్రయాణం సాగుతోంది. ఆమె కంపెనీలో పనిచేస్తున్న ఉద్యోగులంతా మహిళలే! తనతోపాటు ఆ ఉద్యోగులను కూడా ఎదగడానికి అన్ని విధాలా సహాయసహకారాలు అందిస్తున్నారు.

స్వచ్ఛమైన ప్రపంచం కోసం తపన...

శివశంకరి ఎల్లప్పుడూ పర్యావరణ కాలుష్యంపై తీవ్ర ఆందోళన చెందుతుంటుంది. ముఖ్యంగా పాతరకం వాహనాల వల్ల పెరుగుతున్న వాయు కాలుష్యాన్ని, వెలువడుతున్న కర్బన వాయువులను తగ్గించాలనే కీలకమైన అవసరాలను ఆమె గుర్తించింది. వాహన కాలుష్యాన్ని నిరోధించడానికి ఎలక్ట్రిక్ వాహనాలు తయారీ చక్కటి పరిష్కారమవుతుందని భావించి, భావితరాలు పుడమిపై ఆరోగ్యకరమైన స్వేచ్ఛావాయువులు పీల్చాలని ఆశిస్తోంది. భవిష్యత్తుకోసం ఎలక్ట్రిక్ వాహనాల ఉపయోగాన్ని పెంచే దిశగా చర్యలు చేపడుతోంది.. గ్రామీణ ప్రాంతాల మార్కెట్లకు తక్కువ వేగంతో నడిచే టూవీలర్స్ ఉత్పత్తి చేస్తోంది. 2022 నుండి ఆ టూవీలర్స్ అమ్మకాలు వేగం అందుకున్నాయి. వీటితోపాటు రెట్రోఫిట్ కిట్స్ కూడా తయరు చేస్తోంది.

రెండు కేటగిరీల్లో వాహనాలు....

ప్రస్తుతం శివశంకరి తన కంపెనీలో తక్కువ వేగంతో నడిచే ఎలక్ట్రిక్ వాహనాలను రెండు కేటగిరీల్లో తయారు చేస్తున్నారు. 40 కిలోమీటర్లు ప్రయాణించే సామర్థ్యం కలిగిన కిలోవాట్ బ్యాటరీతో నడిచే టూవీలర్, 70 కిలోమీటర్ల మేర ప్రయాణించే సామర్థ్యాన్ని అందించే రెండు కె.వి. బ్యాటరీతో నడిచే టూవీలర్‌ను తయారు చేస్తున్నారు. ఈ వాహనాల బరువు 50 కేజీల లోపే ఉంటాయి. గ్రామీణ ప్రాంతాల్లోని రహదారుల పరిస్థితులను బట్టి వాహనాల బరువు ఎక్కువ ఉండకూడదని ఆమె భావిస్తోంది. అంతేకాకుండా సోడియం అయాన్ బ్యాటరీ ఉపయోగించి ఈమె తక్కువ వేగంతో నడిచే టూవీలర్‌ను మార్కెట్లో ప్రవేశపెడుతున్నారు. సాధారణంగా ఎలక్ట్రిక్ టూవీలర్లలో ఉపయోగించే లిథియం అయాన్ టెక్నాలజీ బ్యాటరీ కంటే సోడియం అయాన్ బ్యాటరీ మన్నికగా, అధిక ఉష్ణోగ్రత నిరోధించే విధంగా, నీటిలో తడిసినా చెడిపోకుండా చాలా కాలం పనిచేస్తాయని ఆమె చెబుతున్నారు.

ఈ సందర్భంగా శివశంకరి 'తరుణి'తో మాట్లాడుతూ.... ఏ రంగంలోనే మగువలు అభివృద్ధి చెందాలంటే సరైన ప్రణాళిక, పట్టుదల, నిరంతర శ్రమ అవసరమని, అప్పుడే మహిళలు భావితరాలకు స్ఫూర్తిదాయకంగా ఉండగలుగుతారని పేర్కొన్నారు.


'ఏఆర్4 టెక్' కంపెనీలో తయారవుతున్న లైట్ వెయిట్ టూ వీలర్


లైట్ వెయిట్ ఎలక్ట్రిక్ టూ వీలర్ టెస్ట్ డ్రైవ్ ...

'వందేమాతరం' సామూహిక గీతాలాపన


వందే మాతరం గీతాలాపన చేస్తున్న దక్షిణ రైల్వే ఉద్యోగులు, సిబ్బంది

పెరంబూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): 'వందేమాతరం' జాతీయ గీతం 150వ వార్షికోత్సవం సందర్భంగా దక్షిణ రైల్వే ఆధ్వర్యంలో సామూహిక గీతాలాపన జరిగింది. న్యూఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో వందే మాతరం 150వ వార్షికోత్సవాలను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో వార్షికోత్సవాలు నిర్వహించారు. దక్షిణ రైల్వే ప్రధాన కార్యాలయంలో అడిషనల్ జనరల్ మేనేజర్ విపిన్ కుమార్, ప్రిన్సిపల్ చీఫ్ పర్సనల్ ఆఫీసర్ కె.హరికృష్ణన్ నేతృత్వంలో నిర్వహించిన వేడుకల్లో సమారు 800 ఉద్యోగులు, సిబ్బంది, రైల్వే పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొని 'వందే మాతరం' గీతాన్ని సామూహికంగా ఆలపించారు. అలాగే, దక్షిణ రైల్వే పరిధిలోని సేలం, తిరుచ్చి, మదురై, తిరువనంతపురం, పాలక్కాడు రైల్వే డివిజన్ కార్యాలయాలు, పెరంబూర్ గ్యారేజ్, వాగన్ వర్క్ షాప్, పెరంబూర్ లోకో వర్క్ షాప్, గోల్డన్ రాక్ వర్క్ షాప్, ఎలక్ట్రికల్ కార్ షెడ్, రైల్వే స్టేషన్లలో ఈ వేడుకలు నిర్వహించినట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది.

చెంబరంబాక్కం నుంచి నీటి విడుదల పెంపు

● అడయార్ తీరప్రాంతాల ప్రజలకు హెచ్చరిక



పెరంబూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): చెంబరంబాక్కం జలాశయం నుంచి 300 ఘనపుటడుగుల అదనపు జలాలు విడుదల చేస్తున్నారు. ఈ కారణంగా అడయార్ తీరప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీచేశారు. నగరవాసుల తాగునీరందించే జలాశయాల్లో ఒకటైన చెంబరంబాక్కం పూర్తి సామర్థ్యం 3.64 టీఎంసీలు (24 అడుగులు). ఇటీవల కురుస్తున్న భారీవర్షాల కారణంగా జలాశయానికి వచ్చే నీరు పెరగడంతో గత నెల 21వ తేది నుంచి జలాశయం నుంచి అదనపు జలాలు విడుదల చేశారు. భారీవర్షాలు కురిస్తున్న సమయంలో జలాశయం నుంచి 750 ఘనపుటడుగుల నీరు విడుదల చేసిన నేపథ్యంలో, వర్షాలు తగ్గడంతో నీటి విడుదల వంద ఘనపుటడుగులకు తగ్గించారు. ఈ క్రమంలో, జలాశయం ఉపరితల ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా జలాశయానికి నీటి ప్రవాహం పెరిగింది. ఈ కారణంగా, జలాశయం నుంచి విడుదల చేసిన నీటిమట్టాన్ని శుక్రవారం మధ్యాహ్నం 300 ఘనపుటడుగులకు పెంచారు. ప్రస్తుతం జలాశయంలో నీటిమట్టం 23 అడుగులకు చేరుకోవడంతో, నీటి రాక పెరిగితే, అదనపు జలాల విడుదల కూడా పెంచుతామని తెలిపిన అధికారులు, అడయార్ తీర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.

స్వాతంత్ర్యోద్యమానికి 'వందేమాతరం' స్ఫూర్తి

● బీజేపీ నేత డాక్టర్ పొంగులేటి సుధాకర్‌రెడ్డి



బీజేపీ నేతలతో పొంగులేటి సుధాకర్ రెడ్డి

ప్యారీస్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): 'వందే మాతరం' గీతం స్వాతంత్ర పోరాటంలో ఉద్యమకారులకు ఎనలేదని స్ఫూర్తినిచ్చిందని తమిళనాడు-కర్ణాటక బీజేపీ జాతీయ సహ-ఇన్‌ఛార్జ్ డాక్టర్ పొంగులేటి సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. భారతదేశ చరిత్రలో అత్యంత ముఖ్యమైన వాటిలో ఒకటైన 'వందే మాతరం' గీతం విరచితమై 150యేళ్లు పూర్తయిన సందర్భంగా శుక్రవారం నుంచి ఏడాదిపాటు ఉత్సవాలు జరుపుకోవాలని కేంద్రప్రభుత్వం ప్రకటించింది. ఆ మేరకు విల్లుపురం ఉత్తర జిల్లాలోని సెంజి కోటలో వందే మాతరం 150వ సంస్మరణ వేడుకల్లో పొంగులేటి సుధాకర్‌రెడ్డి పాల్గొని మహాకవి సుబ్రమణ్యభారతి తమిళ భాషలోకి అనువదించిన వందే మాతర గీతాన్ని సభలోని వారితో కలిసి ఆలపించారు.ఈ సందర్భంగా సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు ఈ వేడుకలో పాల్గొనడం జీవితంలో మరుపురాని గుర్తుగా మిగిలిపోతుందన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బీజేపీ ఉపాధ్యక్షుడు ఏజీ సంపత్, కార్యదర్శి మురళీ రఘురామ్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు కేఆర్ వినాయగం, పాఠశాల, కళాశాల విద్యార్థులు, మాజీ సైనికులు,స్వాతంత్ర్య సమరయోధుల వారసులు, ఉపాధ్యాయులు, మహిళా మోర్చా కార్యకర్తలు పాల్గొన్నారు.


అనుగ్రహ భాషణం చేస్తున్న చిన్న జీయర్‌స్వామి


లక్ష్మీపూజలో భక్తులు

భక్తితోనే అసమానతలు దూరం

● త్రిదండి చిన్న జీయర్ స్వామి

ప్యారీస్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): భక్తితో సమాజంలోని అసమానతలను తొలగించవచ్చని, ప్రతి మనిషి తనలో భక్తిభావం పెంపొందించుకోవాలని త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్‌స్వామి అభిభాషించారు. పెరంబూరులోని ఎస్పీఆర్ సిటీలో సమతా ఇష్టి సేవా కమిటీ, జీయర్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ (జెట్) చెన్నై సంయుక్త ఆధ్వర్యంలో గురువారం ప్రారంభమైన 'సమతా ఇష్టి' రెండో రోజు కార్యక్రమం శుక్రవారం చిన్న జీయర్ స్వామి అధ్యక్షతన సుదర్శన నృసింహ ఇష్టితో ప్రారంభమైంది. ఉదయం 8 గంటలకు గోపూజ, తీర్థగోష్టి, 10 గంటలకు భగవత్ రామానుజులు, పెరుమాళ్, తాయారులకు తిరుమంజనం, 10.30 గంటలకు లక్ష్మీపూజ, 12 గంటలకు ఉదయ పూర్ణాహుతి, దీపారాధన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం లక్ష్మీపూజలో పాల్గొన్న భక్తులనుద్దేశించి చిన్న జీయర్‌స్వామి అనుగ్రహ భాషణం చేశారు. కార్తిక శుక్రవారం పర్వదినం సందర్భంగా లక్ష్మీదేవిని భక్తిభావంతో పూజిస్తే సర్వసంపదలు కలుగుతాయన్నారు. సుదర్శన ఇష్టి మానవులకు సర్వరక్షణ కవచం వంటిదని, మానవ సేవే సర్వ ప్రాణిసేవ అనే పరమార్థాన్ని ప్రతి ఒక్కరూ అర్థం చేసుకోవాలని సూచించారు. సమతా ఇష్టి వేదికను భక్తులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కాగా, సమతా ఇష్టి మహాయజ్ఞాన్ని పురస్కరించుకుని సెప్టెంబర్ 17 నుంచి ఈ నెల 6వ తేదీ వరకు భక్తులు తమ నివాసాల్లో బియ్యం గింజలు పేర్చిన పాత్రలను లక్ష్మీపూజ సందర్భంగా భగవత్ రామానుజులకు సమర్పించి దీక్ష విరమించారు. సాయంత్రం 5 నుండి రాత్రి 8.30 గంటల వరకు జరిగిన విష్ణు సహస్రనామ పారాయణం, సాంస్కృతిక ప్రదర్శన, సాయంకాల పూర్ణాహుతి కార్యక్రమాల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. జెట్ చెన్నై అధ్యక్షులు పి.రవీంద్రకుమార్‌రెడ్డి బృందం ఏర్పాట్లను పర్యవేక్షించి భక్తులకు ఉదయం, సాయంత్రం అల్పాహారం, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

నరువి ఆస్పత్రిలో వృద్ధుడికి లివర్ మార్పిడి

వేలూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): వేలూరులోని నరువి ఆస్పత్రిలో 62 యేళ్ల వృద్ధుడికి అరుదైన లివర్ మార్పిడి చికిత్సను విజయవంతంగా పూర్తిచేసినట్లు ఆస్పత్రి అధ్యక్షుడు జీవీ.సంపత్ ప్రకటించారు. గత కొన్ని నెలలుగా లివర్ సంబంధిత వ్యాధితో ప్రాణాపాయ స్థితిలోవున్న ఆంధ్రప్రదేశ్ నెల్లూరు జిల్లాకు చెందిన 64 యేళ్ల వృద్ధుడికి శుక్రవారం శస్త్రచికిత్స విజయవంతంగా చేశారు. చెన్నైలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో మెదడు నిర్జీవమై మృతిచెందిన ఓ యువకుడి అవయవదానంతో అతని లివర్‌ను వైద్యులు వృద్ధుడికి అమర్చి వైద్యులు విజయవంతంగా అవయవమార్పిడి పూర్తిచేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రి యాజమాన్యం మాట్లాడుతూ, లివర్ మార్పిడి చికిత్స అనేది కష్టతరమైనదని, అయినప్పటికీ వైద్యుల అనుభవంతో దానిని సులువుగా పూర్తి చేశామని, చికిత్స పొందిన వృద్ధుడికి 21రోజులు ఐసీయూలో చికిత్స అందించిన అనంతరం డిశ్చార్జ్ చేయనున్నట్లు తెలిపారు.



పాంబన్ జాలర్లకు చిక్కిన కూరల్ చేపలు

● రూ.1.65 లక్షలకు విక్రయం


జాలరి వలలో పడిన కూరల్ చేపలు


చేపల కడుపులో ఉన్న గాలి సంచులు (మాప్స్)

పెరంబూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పాంబన్ జాలరి వలలో చిక్కిన అరుదైన రెండు కూరల్ చేపలు రూ.1.65 లక్షలకు వ్యాపారులు కొనుగోలు చేశారు. రామనాథపురం జిల్లా పాంబన్ మన్నార్ వలకుడై ప్రాంతం నుంచి గురువారం 90 ఫైబర్ పడవల్లో జాలర్లు చేపల వేటకు వెళ్లారు. చేపల వేట ముగించుకుని శుక్రవారం ఉదయం తీరానికి చేరుకున్నారు. ఓ జాలరి వలలో 22 కిలోలు, 24 కిలోల బరువున్న రెండు కూరల్ చేపలు చిక్కాయి. సుమారు 45 కిలోల బరువైన ఈ చేపలను కిలో రూ.3,600 చొప్పున ఓ వ్యాపారి వేలంలో కొనుగోలు చేశారు. కూరల్ చేపలపై పాంబన్ జాలర్లు మాట్లాడుతూ... ఈ చేపలను ఆహారం కోసం ఉపయోగించరని, చేప కడుపులో మాప్స్ కనిపిస్తాయని, ఇవి రబ్బరు గొట్టాల ఆకారంలో గాలిసంచుల్లా ఉంటాయన్నారు. ఈ మాప్స్‌ను బీర్, వైన్, జెల్లీ క్యాండీ వంటి ఆల్కహాలిక్ పానీయాలు రుచిగా, చెడిపోకుండా తయారుచేయడానికి ఉపయోగిస్తారని తెలిపారు. తూర్పు ఆసియా దేశాల్లో, ఈ మాప్‌లను ఖరీదైన సూప్ తయారుచేసేందుకు వినియోగిస్తారని జాలర్లు తెలిపారు.

శ్రీవారిసేవలో ప్రముఖులు




నీలం సాహ్నీ - దివి

తిరుమల శ్రీవారిని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. ఏపీ ఎన్నికల కమిషనర్ నీలం సాహ్నీ, సెంట్రల్ ఎన్‌ఫోర్సుమెంట్ డైరెక్టర్ రాహుల్ నవీన్, శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, సినీనటి దివి ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.


- తిరుమల, ఆంధ్రజ్యోతి

మదనపల్లె 'మిట్స్'లో 5,6 తేదీల్లో పాలిటెక్నిక్ అధ్యాపకుల జాతీయసదస్సు

పోస్టర్ ఆవిష్కరించిన ఆర్జేడీ నిర్మల్‌కుమార్ ప్రియ

తిరుపతి(విద్య), నవంబరు7 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా మదనపల్లెలోని మిట్స్ డీమ్డ్ టుబీ యూనివర్సిటీలో డిసెంబరు 5, 6 తేదీలలో దేశవ్యాప్తంగా ఉన్న పాలిటెక్నిక్ కళాశాలల అధ్యాపకులకు అవుట్‌కమ్ బేస్ట్ ఎడ్యుకేషన్‌పై జాతీయ సదస్సు జరగనుంది. ఈ సదస్సుకు సంబంధించి పోస్టర్లను శుక్రవారం తిరుపతిలోని సాంకేతికవిద్య కార్యాలయంలో ఆర్జేడీ నిర్మల్‌కుమార్ ప్రియా, అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ప్రకాశ్‌కుమార్, మిట్స్ ప్రతినిధులు జి.శ్రీనివాసులు, కేఎండీ రియాజ్ అలీ ఆవిష్కరించారు. పాలిటెక్నిక్‌లలో ఆఫర్ చేస్తున్న కోర్సులకు నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్(ఎన్‌బీఏ) ఎంతో ప్రధానమని ఆర్జేడీ చెప్పారు. ఇందులో భాగంగా అవుట్ కమ్ బేస్ట్ ఎడ్యుకేషన్‌పై అధ్యాపకులకు అవగాహన పెంచేందుకు ఈసదస్సు నిర్వహిస్తున్నామని వివరించారు. బోధనలో నాణ్యత పెంపు, పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను విద్యార్థులకు అందించడం ప్రధాన లక్ష్యాలని పేర్కొన్నారు. దీన్ని అధ్యాపకులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సర్వదర్శనానికి 12 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 5 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

బుధవారం హుండీ ఆదాయం: రూ.3.52 కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 61,718

తలనీలాలు సమర్పించినవారు: 21,937


హస్తకళావిలాసం

గాంధీ శిల్పబజార్

● శిల్పారామంలో 9 దాకానే



తిరుపతి శిల్పారామంలో దేశంలోని విభిన్న హస్తకళలు కొలువుతీరాయి. కళాకారులే స్వయంగా ఇక్కడ తమ ఉత్పత్తులను విక్రయిస్తున్నారు. 'గాంధీ శిల్ప బజార్ 2025' పేరుతో ఈ నెల 4న తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో ఈ ప్రదర్శన ప్రారంభం అయ్యింది. కేంద్ర ప్రభుత్వం, కళా సృష్టి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో దీనిని నిర్వహిస్తున్నారు. ఈ నెల 9 దాకా ఈ ప్రదర్శన ఉంటుంది. ఉదయం 10 నుంచి రాత్రి 8గంటల వరకు సందర్శించవచ్చని శిల్పారామం ఏవో సుధాకర్ తెలిపారు. అరుదైన ఎన్నో కళాకృతులు ఇక్కడ లభిస్తున్నాయి. కొన్ని స్టాల్స్‌లో కళాకారులు స్వయంగా తమ ఉత్పత్తులను తయారు చేస్తూ కనిపిస్తారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన కళాకారులతో మాట్లాడే అరుదైన అవకాశం ఇక్కడికి వెళ్తే లభిస్తుంది.



- తిరుచానూరు, ఆంధ్రజ్యోతి






పుదుచ్చేరి ప్రత్యేకం



పుదుచ్చేరికి చెందిన రాహుల్ కుటుంబం గడచిన 40 ఏళ్లగా కొబ్బరిచెట్టు నుంచి వివిధ కళాకృతులను తయారు చేస్తోంది. కొబ్బరి చిప్పలతో లైటింగ్ ల్యాంప్స్, పిల్లల ఆట వస్తువులు ఈ స్టాల్ ప్రత్యేక ఆకర్షణగా ఉన్నాయి.

కాశ్మీర్ చీరలు



గాంధీ శిల్పబజార్‌లో కాశ్మీరీ శారీస్ విస్తృతంగా అమ్ముడు పోతున్నాయి. కాశ్మీర్‌కు చెందిన సఫత్ హుస్సేన్ కుటుంబం గడచిన కొన్ని తరాలుగా ప్రత్యేక ఊలుతో చీరలు తయారు చేసి విక్రయిస్తోంది. చాలా అందమైన డిజైన్లలో ఇవి లభిస్తున్నాయి. ధరలు రూ.2వేలు నుంచి రూ.లక్ష వరకు ఉన్నాయి.




తెల్లజిల్లేడుతో వినాయక విగ్రహాలు


తెల్లజిల్లేడుతో తయారుచేసిన వినాయక బొమ్మలకు మార్కెట్‌లో బహు గిరాకీ ఉంది. జీడీనెల్లూరుకు చెందిన త్యాగరాజులు 20 ఏళ్లగా తెల్లజిల్లేడుతో వినాయక ప్రతిమలను రూపొందించడంలో దిట్ట. ఈ స్టాల్‌లో రూ.120 నుంచి తెల్లజిల్లేడు విగ్రహాలను విక్రయిస్తున్నారు. తెల్లజిల్లేడుతో చేసిన కీచైన్స్ ఆకట్టుకుంటున్నాయి.






మహాబలిపురం ముత్యాలు





మహాబలిపురంకి చెందిన కళాకారుడు కృష్ణన్ స్టాల్‌లో సముద్రంలో సహజసిద్ధంగా దొరికే ఆలుచిప్పలు, ముత్యాలు, పగడాలు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. ఒరిజనల్ ముత్యాలు, పగడాలు విక్రయించడం వీరి ప్రత్యేకత. పలు ఆభరణాలు ఉన్నాయి. ఇక చిన్న చిన్న రాతి విగ్రహాలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.

ఎల్లప్ప టెర్రకోట బొమ్మలు



పలమనేరుకు చెందిన ఎల్లప్ప మట్టితో తయారుచేసిన 500 రకాల టెర్రకోట బొమ్మలు ప్రదర్శనలో ప్రత్యేక ఆకర్షణగా ఉన్నాయి. రకరకాల బొమ్మలు, వాటర్ బాటిల్స్ దీపాలు వంటి మట్టి కళాఖండాలు ఇక్కడ ఉన్నాయి. టెర్రకోట కళాకారుడు ఎల్లప్పకు గతంలో జాతీయ అవార్డు కూడా లభించింది.



- ధర్మవరంకు చెందిన జనార్ధన్ కుటుంబం తయారు చేస్తున్న లెదర్‌పెయింట్స్, డోర్ హ్యాంగిల్స్, లైటింగ్ ల్యాంప్స్ విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.
- దేవదారుచెక్కతో వంట సామాగ్రి, వెదురుతో చేసి నీళ్ల గ్లాసులు, టీకప్పులు ఇక్కడ లభిస్తున్నాయి.
- పెన్ కలంకారీకి మన శ్రీకాళహస్తి ప్రసిద్ధి అయితే, బ్లాక్ ప్రింటింగ్‌కి పెడన ప్రత్యేకం. పెడనకకు చెందిన జీవన కుమార్ బ్లాక్ ప్రింటింగ్‌లోని కలంకారీ షర్ట్స్, చీరలు, చున్నీలు విక్రయిస్తున్నారు.



ఎర్రచందనం స్మగ్లర్‌కు ఐదేళ్ల జైలు

● రూ.6 లక్షల జరిమానా

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): శేషాచలం అడవుల నుంచి ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ పోలీసులకు పట్టుబడిన స్మగ్లర్‌కు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.6 లక్షల జరిమానా విధిస్తూ తిరుపతి ఏడీజే కోర్టు న్యాయమూర్తి నరసింహమూర్తి శుక్రవారం తీర్పునిచ్చారు. తమిళనాడు రాష్ట్రం వేలూరుకు చెందిన ఎస్.గుణశేఖర్ 2016లో నాగపట్ల ఈస్ట్ బీట్, చామలరేంజ్ పరిధిలో ఎర్రచందనం దుంగలను తమిళనాడుకు తరలిస్తుండగా అటవీశాఖ అధికారులు పట్టుకున్నారు. అరెస్టు చేసి కోర్టు ఎదుట హాజరుపరచగా రిమాండ్ విధించింది. తర్వాత బెయిల్‌పై ఇతడు బయటకు వచ్చాడు. గత తొమ్మిది సంవత్సరాలుగా వివిధ దశల్లో విచారణలో ఉన్న కేసును రాష్ట్ర స్థాయి ఎర్రచందనం కోర్టుకు బదిలీ చేశారు. ఏడాదిపాటు విచారణ జరిగింది. గుణశేఖర్‌పై సాక్ష్యాధారాలు నిరూపణ కావడంతో ప్రాసిక్యూషన్ వాదనలు విన్న తర్వాత నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.ఆరు లక్షల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. అనంతరం నిందితుడ్ని నెల్లూరు సెంట్రల్ జైలుకు తరలించారు.

ప్రజాప్రతినిధుల పీఆర్వోలు టికెట్లు అమ్ముకుంటున్నారు

● డయల్ యువర్ ఈవోలో భక్తుడి ఫిర్యాదు



డయల్ యువర్ ఈవో కార్యక్రమంలో పాల్గొన్న ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, అధికారులు

తిరుమల, నవంబరు7(ఆంధ్రజ్యోతి): తిరుమలలో కొంతమంది ప్రజాప్రతినిధుల పీఆర్వోలు అధిక ధరలకు వీఐపీ బ్రేక్ దర్శనాలను అమ్ముకుంటున్నారని ఈశ్వర్(అనంతపురం) అనే భక్తుడు ఈవో అనిల్‌కుమార్ సింఘాల్‌కు ఫిర్యాదు చేశారు. డయల్ యువర్ ఈవో కార్యక్రమంలో శుక్రవారం పలువురు భక్తులు ఈవోతో ఫోన్‌లో సంభాషించారు. ఈ సమయంలో ఈశ్వర్ మాట్లాడుతూ ఒక టికెట్‌ను రూ.5 వేల నుంచి రూ.6 వేలకు అమ్ముతున్నారని చెప్పారు. ఇటువంటి వారిని కట్టడి చేయాలని కోరారు. దళారీలపై ఫిర్యాదులు వస్తున్నాయని,విజిలెన్స్ విభాగం చర్యలు తీసుకుంటోందని ఈవో సమాధానం ఇచ్చారు. భక్తులు కూడా దళారీలను ఆశ్రయించకుండా టీటీడీ అధికారిక వెబ్‌సైట్, కౌంటర్ల ద్వారానే టికెట్లు, టోకెన్లు పొందాలని సూచించారు.

డయల్ యువర్ ఈవో కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి 17 మంది భక్తులు ఈవోతో ఫోన్‌లో మాట్లాడారు. దర్శన సమయంలో ఆలయంలోని శ్రీవారిసేవకులు లాగేస్తున్నారని, దర్శన టికెట్ల బుకింగ్ సమయంలో ఓటీపీ ఆలస్యంగా వస్తోందని మణికంఠ(అనంతపురం) ఫిర్యాదు చేశారు. ఓటీపీ సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని, అలాగే భక్తులతో మెలిగే విధానంపై శ్రీవారిసేవకులకు శిక్షణా కార్యక్రమాలను నిర్వహించాలని నిర్ణయించామని ఈవో బదులిచ్చారు. 2023లో ఇంజినీరింగ్ విభాగంలో ఉద్యోగాల నోటిఫికేషన్ ఇచ్చారని, కానీ ఇప్పటికీ ఎలాంటి నియామకాలు జరగలేదని గణేష్(కడప) ఈవో దృష్టికి తీసుకురాగా, 15 రోజుల్లోనే ఈ సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దివ్యాంగులు, వృద్ధులకు ఆఫ్‌లైన్‌లోనూ టోకెన్లు కేటాయిస్తామని బోర్డు ప్రకటించినప్పటికీ చర్యలు తీసుకోలేదని జగన్(జగిత్యాల) తెలుపగా, భక్తుల అభిప్రాయ సేకరణ, కమిటీ సిఫార్సుల మేరకు త్వరలోనే నిర్ణయాలు తీసుకుంటామని ఈవో అన్నారు. మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు వంటి ప్రముఖుల సూచనలను దృష్టిలో పెట్టుకుని వీఐపీలు ఏడాదిలో కొన్నిసార్లు మాత్రమే దర్శనం చేసుకునేలా చూడాలని మునిలక్ష్మి(తిరుపతి) కోరారు.

బుకింగ్ సమయంలో ఆధార్ అప్‌లోడింగ్ సమస్య

దర్శన టికెట్లు, టోకెన్ల బుకింగ్ సమయంలో ఆధార్ అప్‌లోడ్ చేసేలోపు కోటా పూర్తయిపోతోందని హరిణి అనే భక్తురాలి ఫిర్యాదుపై ఈవో బదులిస్తూ.., బుకింగ్ సమయంలో మళ్లీ ఆధార్ అప్‌లోడ్ చేసే అవసరం లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే పేమెంట్ సమయంలో క్రెడిట్, డెబిట్ కార్డులు ఉపయోగించే అవసరం లేకుండా ఆర్బీఐ సూచించిన యూపీఐ, వ్యాలెట్ ద్వారా చెల్లించే అంశాలను కూడా ఐటీ అధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు.

హత్యాయత్నం కేసులో పదేళ్ల జైలు

చిల్లకూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మహిళపై హత్యాయత్నం కేసులో నిందితుడికి పదేళ్ల జైలు శిక్ష, రూ.2వేల జరిమానా విధిస్తూ నెల్లూరు 8వ జిల్లా జడ్జి తీర్పు ఇచ్చినట్లు పోలీసులు శుక్రవారం తెలిపారు. మండలంలోని తిక్కవరం గ్రామానికి చెందిన వీరరాఘవయ్య ఆస్తి వివాదాల నేపథ్యంలో తన బావమరిది భార్య వెంకటలక్ష్మిపై 2017లో హత్యాయత్నానికి పాల్పడ్డాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. కోర్టు విచారణలో నేరం రుజువుకావడంతో నిందితుడికి పదేళ్ల జైలు శిక్ష, రూ.2వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి శుక్రవారం తీర్పు ఇచ్చారు.

పుత్తూరు కమిషనర్‌గా నాగేశ్వరరావు

తిరుపతి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పుత్తూరు మున్సిపల్ కమిషనర్‌గా డి.వి.నాగేశ్వరరావు నియమితులయ్యారు. నెల్లూరు జిల్లా కావలి మున్సిపాలిటీలో శానిటరీ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న ఆయన గ్రేడ్ 3 మున్సిపల్ కమిషనర్‌గా పదోన్నతిపై పుత్తూరుకు బదిలీ అయ్యారు. అక్కడి కమిషనర్ ఎం.మంజునాథ గౌడ్ అతడి వాస్తవ పోస్టు అయిన నంద్యాల జిల్లా నందికొట్కూరు మున్సిపల్ మేనేజర్‌గా బదిలీ అయ్యారు. వెంకటగిరి మున్సిపల్ కమిషనర్ జి.వెంకటరామిరెడ్డి వాస్తవ పోస్టు శానిటరీ ఇన్‌స్పెక్టర్ కాగా, ఇపుడు గ్రేడ్ 3 మున్సిపల్ కమిషనర్‌గా పదోన్నతి పొందారు.

వన్ గ్రామ్ గోల్డ్ ఆభరణాలతో రూ.72 లక్షల రుణాలు

● డీసీసీబీ సీఈవోకు ఫిర్యాదు

భాకరాపేట, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): చిన్నగొట్టిగల్లు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో వన్ గ్రామ్ గోల్డ్ ఆభరణాలు తనఖా పెట్టి రూ.72 లక్షల రుణాలు పొందారని సింగిల్ విండో అధ్యక్షుడు ముత్తం ప్రభాకర్ ఆరోపించారు. దీనిపై విచారణ జరిపించాలని జిల్లా సహకార బ్యాంకు సీఈవోకు ఫిర్యాదు చేశారు. '2020 మార్చి నుంచి 2025 ఆగస్టు వరకు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో ఆర్థిక లావాదేవీలలో అవకతవకలు జరిగాయని, ఈ నెల 4న డీసీసీ బ్యాంకు బ్రాంచ్ మేనేజర్ బంగారును పరిశీలించగా అందులో వన్ గ్రాము గోల్డ్ ఆర్నమెంట్స్ ఉన్నాయని గుర్తించారు. కె.రెడ్డమ్మ, సి.రుతున్ పేర్లతో 2025 జనవరి 18, 21న, ఫిబ్రవరి 11వ తేదీలలో ఈ ఆభరణాలు పెట్టినట్లు ఉంది' అని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు.



● చిత్తూరులో జోయాలుక్కాస్

బ్రిలియన్స్ డైమండ్ జ్యువెలరీ షో

ప్రముఖ జోయాలుక్కాస్ సంస్థ చిత్తూరులో 'బ్రిలియన్స్ డైమండ్ జ్యువెలరీ షో'ను ప్రారంభించింది. ఈ కార్యక్రమంలో వినియోగదారులతో పాటు ఏఎస్పీ రాజశేఖర్ రాజ్, నటి దివి వాడ్యా, రిటైల్ హెడ్ రాజేష్ కృష్ణన్, రీజనల్ మేనేజరు శ్రీజేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి అందాల మామండూరు

● మరింత అభివృద్ధి చేస్తే పెరగనున్న సందర్శకులు

● నేడు డిప్యూటీ సీఎం పర్యటన



గుంటి మడుగు వాచ్ టవర్‌కు వెళ్లే మార్గం

రేణిగుంట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): అటవీ ప్రాంతంలో.. ప్రకృతి అందాల నడుమ ఉన్న మామండూరు పర్యాటక కేంద్రంలో మరిన్ని వసతులు కల్పిస్తే సందర్శకుల సంఖ్య పెరుగుతుంది. ప్రముఖ పర్యాటక ప్రాంతంగా విరాజల్లితుంది. శనివారం రేణిగుంట మండలంలోని మామండూరును సందర్శించనున్న అటవీశాఖ మంత్రి, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఈ దిశగా చర్యలు చేపట్టాలని పర్యాటకులు కోరుతున్నారు. సెలవు దినాల్లో 700కుపైగా.. సాధారణ రోజుల్లో 130 మంది వస్తున్నారు. ప్రస్తుతానికి 6 కాటేజీలున్నాయి. ఇక, అన్ సీజన్ అయిన ఎండా కాలంలో సందర్శకుల శాతం పెంచేందుకు రిసార్టులు, పిల్లలు ఆడుకునేలా పార్కులు ఏర్పాటు చేయాలి. వారాంతపు సెలవు దినాల్లో ఎక్కువ మంది సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు శేషాచలం అటవీ ప్రాంతాల్లో అడ్వెంచర్ల కోసం వస్తుంటారు. వీరికోసం ప్రకృతి బాట నుంచి అభివృద్ధి చేస్తే ఎక్కువగా వస్తారు. ఇక, మామండూరు గెస్ట్‌హౌస్ నుంచి గుంటిమడుగు వద్ద వాచ్‌టవర్‌పై నుంచి ప్రకృతి అందాలు చూడొచ్చు. ఇక, గంటి మడుగు జలపాతంలో ఎప్పుడూ నీళ్లు ప్రవహిస్తుంటాయి. ఇక్కడికి సందర్శకులను అనుమతించడంలేదు. కొన్ని జాగ్రత్తలు తీసుకుని అనుమతించాలని కోరుతున్నారు. షికారి లైన్, వెద్దురు, మల్లేరు వంక, బ్రహ్మదేవుని గుండం, ఉడగమనుదొడ్డి బేస్ క్యాంప్ ప్రాంతాలకు రోడ్డువేసి జంగిల్ సఫారీకి అనుమతిస్తే సందర్శకులు పెరుగుతారు. శని, ఆదివారాల్లో మామండూరు గెస్ట్‌హౌస్ వరకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేస్తే సందర్శకులకు అనుకూలంగా ఉంటుంది. ఇలా సందర్శకులు పెరిగేలా జిల్లా అధికారుల సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకోవాలన్నది పర్యాటకుల కోరిక.

పవన్ పర్యటనకు భారీ భద్రత

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మూడు కార్యక్రమాలు.. తొమ్మిది గంటల పాటు సాగే డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పర్యటనకు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎస్పీ సుబ్బరాయుడు పర్యవేక్షణలో నలుగురు అదనపు ఎస్పీలు, ఆరుగురు డీఎస్పీలు, 25 మంది సీఐలు, 50 మంది ఎస్ఐలు, మరో 300 మంది ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, రోప్ పార్టీలు, రిజర్వు బలగాలు, డాగ్, బాంబు స్క్వాడ్‌లు, రోడ్డు డిగ్గింగ్ పార్టీలు, అటవీశాఖ అధికారులు బందోబస్తు విధుల్లో పాల్గొంటారు. మామండూరు అటవీ ప్రాంతంలో పవన్ పర్యటన ఉండటంతో మరింత అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు.

హీరోయిన్ బరువును ప్రశ్నించిన యూట్యూబర్

నటి గౌరీ కిషన్ ఆగ్రహం... అండగా సినీ, పాత్రికేయ సంఘాలు



గౌరీ కిషన్

చెన్నై, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): హీరోయిన్‌ను 'మీ బరువెంత?' అంటూ ఓ ట్యూబర్ వేసిన ప్రశ్న కోలీవుడ్‌లో తీవ్ర వివాదం రేపుతోంది. అతనిపై ఆ హీరోయిన్‌తో పాటు పలువురు నటీనటులు, పాత్రికేయ సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఇటీవల చెన్నైలో జరిగిన 'అదర్స్' చిత్ర ప్రెస్‌మీట్‌లో ఓ యూట్యూబర్.. హీరోయిన్ గౌరీ కిషన్ బరువు గురించి అడిగాడు. దీనిపట్ల ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 'నా బరువు మీకేమైనా ఇబ్బంది కలిగిస్తోందా? అది సినిమాకు ఎలా ముఖ్యమవుతుంది? నా బరువు నా ఇష్టం. అది సినిమాకు గానీ, నా ప్రతిభకు గానీ సంబంధించిన విషయం కాదు. ఇది బాడీ షేమింగ్ తప్ప మరొకటి కాదు. సినిమా ప్రెస్‌మీట్‌లో ఇంతకంటే తెలివితక్కువ ప్రశ్న మరొకటి లేదు' అంటూ విరుచుకుపడ్డారు. ప్రస్తుతం ఆమె ఆగ్రహం సామాజిక మాధ్యమాల్లో తెగవైరల్ అవుతోంది. దీని గురించి ఆ చిత్ర హీరో ఆదిత్య మాధవన్ మాట్లాడుతూ.. ఆ యూట్యూబర్ ప్రశ్నతో నేను స్తంభించిపోయాను. చాలా ఆశ్చర్యం గొలిపింది. అందుకే వెంటనే నేను స్పందించలేకపోయాను' అంటూ ఎక్స్‌లో వివరణ ఇచ్చారు. కాగా సౌత్ ఇండియన్ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ (నడిగర్ సంఘం) ఈ వ్యవహారాన్ని తీవ్రంగా ఖండించింది. జర్నలిజం ముసుగులో వున్న కొంతమంది వక్రబుద్ధి గల వ్యక్తులు ప్రెస్ సమావేశాల్లో నటీమణులను ఎగతాళి చేయడం, అవమానించడం, ఆందోళనకరం అని పేర్కొంది. నటి గౌరీ కిషన్ బాధను తాము అర్థం చేసుకుంటున్నామని, ఓ మనిషి ఆకారాన్ని విమర్శిస్తే మానసికంగా బాధ కలుగుతుందని, ఇలాంటి బాడీ షేమింగ్ చర్యలకు పాల్పడేవారిని తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొంది. సీనియర్ నటి ఖుష్బూ కూడా నటి గౌరీ కిషన్‌కు గట్టి మద్దతునిస్తున్నట్లు ప్రకటించారు. ఇదే విధంగా చెన్నై ప్రెస్ క్లబ్ కూడా నటి గౌరీ కిషన్‌కు మద్దతుగా, అవమానకరమైన ప్రశ్న వేసిన యూట్యూబర్ ఖండిస్తూ ప్రకటన జారీ చేసింది.